


https://www.sreechakranews.com

# శ్రీచక్ర

SREECHAKRA TELUGU DAILY




సంపుటి 10 | సంచిక 157 | కర్నూలు | శుక్రవారం జూలై 04 2025 | పేజీలు : 08 | వెల రూ. 5.00

Published from Kurnool... Circulated by Andhra Pradesh, Telangana & New delhi

# వృధా గోదావరి జలాల వినియోగమే లక్ష్యం

**తెలంగాణలో ప్రాజెక్టులను ఎన్నడూ వ్యతిరేకించలేదు**
**దేవాదులతో ఎత్తిపోతలకు నేనే శ్రీకారం చుట్టా**
**200 టిఎంసిల వృధా జలాలో బనకచర్లకు ప్లాన్**
**వృధా జలాలను వాడుకుంటే తెలుగు రాష్ట్రాలకు మేలు**
**జగన్ కుత్సిత రాజకీయాలతో కలుషితం చేస్తున్నారు**
**సింగయ్య మృతిలో కనీస మానవత్వం ప్రకటించని నేత**
**మామిడి రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటాం**
**ఆహారపు అలవాట్లకు అనుగుణంగా పంటల విధానం**
**కుప్పంలో మీడియా సమావేశంలో చంద్రబాబు**



కుప్పం,జూలై3 : తెలంగాణలో గోదావరి ప్రాజెక్టులకు తాను ఎప్పుడూ వ్యతిరేకం కాదని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. తాను ఉమ్మడి ఎపి సిఎంగా ఉండగానే దేవాదుల ఎత్తిపోతలను ప్రారంభించానని గుర్తు చేశారు. గోదావరిలో ఏటా 2వేల క్యూసెక్కులకు పైగానే వృధ్ధాగా సముద్రంలో కలుస్తోంది. వీటిని ఎవరు వాడుకున్నా మంచిదేనని, అందుకే వృదానీటి ద్వారా బనకచర్లకు పూనుకున్నా మని అన్నారు. ఇందులో ఎవరు కూడా విమర్శలకు పోవాల్సిన అవసరం లేదన్నారు. కుప్పం పర్యటనలో ఉన్న బాబు గురువారం మీడియాతో మాట్లాడారు. బనకచర్ల ప్రాజెక్ట్‌తో ఎవరికీ నష్టం లేదని స్పష్టం చేశారు. సముద్రంలోకి పోయే నీటిని వాడుకుంటే రెండు రాష్ట్రాలు బాగుపడతాయని చెప్పుకొచ్చారు. తెలంగాణ ప్రాజెక్ట్‌లని తానెప్పుడూ వ్యతిరేకించలేదని స్పష్టత ఇచ్చారు. నీటి సమస్య పరిష్కారమైతే తెలుగువారు బాగుపడతారని ఉద్ఘాటించారు. వృథాగా సముద్రంలోకి పోయే వాటిలో 200 టీఎంసీలు వాడుకుంటే తెలుగు ప్రజలు బాగుపడతారు. నీటి సమస్య పరిష్కారమవుతుంది. ఇదే విషయాన్ని పదే పదే చెబుతున్నా.. ఎవరికీ నష్టం లేదు. తెలంగాణలో గోదావరిపై నిర్మించిన ప్రాజెక్టులను ఎప్పుడూ నేను వ్యతిరేకించలేదు. వ్యతిరేకించను కూడా అని అన్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరోమారు తీవ్ర వమిర్శలు గుప్పించారు. సింగయ్య భార్యను పిలిపించి బెదిరించి రాజకీయం చేస్తారా అని ప్రశ్నించారు. కారు కింద పడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలించే ఓపిక కూడా లేదా అని ప్రశ్నించారు. కనీస బాధ్యత, సామాజిక స్పృహ లేకుండా ప్రవర్తిస్తారా అని నిలదీశారు. కారు కింద పడిన వ్యక్తిని కుక్కపిల్ల మాదిరిగా పక్కన పడేస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏమీ చేయలేని వాళ్లే శవ రాజకీయాలు చేస్తుంటారని ధ్వజమెత్తారు. నీతిమాలిన వాళ్లు, రౌడీలు రాజకీయాల్లో ఉన్నారని సీఎం చంద్రబాబు విమర్శించారు. చిల్లిగవ్వ కూడా ఖర్చు చేయని వాళ్లు తమ ప్రభుత్వం గురించి మాట్లాడు తున్నారని మండిపడ్డారు. దోచుకోవడమే తప్ప ఇవ్వడం తెలియని వాళ్లతో రాజకీయాలు చేయాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. పేదలను మీరు ఆదుకోకపోగా.. పనిచేస్తున్న తమ ప్రభుత్వంపై విమర్శలు చేస్తారా అని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుడు పనులు తాత్కాలికం.. చేసిన పనులే శాశ్వతమని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. తానేప్పుడూ తప్పుడు ప్రచారాలతో రాజకీయాలు చేయలేదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. మామిడి రైతులకు తాము చేసినంత సాయం గతంలో ఎవరైనా ఇచ్చారా అని సీఎం చంద్రబాబు ప్రశ్నించారు. శవ రాజకీయాలు చేసే వారు మామిడి రైతులపై ప్రేమ కురిపిస్తున్నారని అన్నారు. రైతుల ఇబ్బందులను తాము పరిష్కరిస్తామని.. రైతులకూ తమపై నమ్మకం ఉందని ఉద్ఘాటించారు. మామిడి రైతుల గురించి.. వ్యవసాయం, హార్టీకల్చర్ గురించి ఏ మాత్రం పట్టించుకోని వారు ఇప్పుడు మాట్లాడతారా, మైక్రో సబ్సిడీలిచ్చారా అని ప్రశ్నించారు. హంద్రీనీవా పనులను తామే చేపడుతున్నామని స్పష్టం చేశారు. ఈ ఏడాదిలోనే రూ.3980 కోట్లు ఖర్చు పెడుతున్నా మని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఆధునిక పద్ధతుల ద్వారా వ్యవసాయంలో లాభాలు వస్తాయని తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ ఇంటర్నేషనల్ మార్కెటింగ్‌పై చర్చిస్తున్నామని అన్నారు. మారిన ఆహారపు అలవాట్లకు అనుగుణంగా పంటల సాగు చేయాలని సూచించారు. ప్రపంచంలో ఆహారపు అలవాట్లు మారాయని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. ఏ పంట వేస్తే లాభదాయకమో కూడా ఆలోచిస్తున్నామని అన్నారు. తమిళనాడులో లేని ఫుడ్ ప్రాసెసింగ్ ఏపీలో ఉందని ఉద్ఘాటించారు. సుపరిపాలనలో తొలిఅడుగులో భాగంగా ఇంటింటికీ వెళ్తున్నామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. రాయలసీమలో ఒకేసారి రూ.3,950 కోట్లు హంద్రీనీవాకు డబ్బులిచ్చాం. మైక్రో ఇరిగేషన్‌కు 90శాతం సబ్సిడీ ఇస్తున్నాం. పంటలకు ప్రాధాన్యత ఇస్తూ గిట్టుబాటు వచ్చేలా చేస్తున్నాం. రైతుకు ఎక్కువ ఆదాయం రావాలని వాణిజ్య పంటలకు వెళ్లాం. అయితే, వాణిజ్య పంటల్లో ఒక్కోసారి తక్కువ రేట్లు కూడా వస్తాయి. అనేక ఇబ్బందులను అధిగమించి ముందుకెళ్తున్నాం. రైతులను అన్ని విధాలా ఆదుకునే ప్రభుత్వం మాది. గత ప్రభుత్వం ఒక్క బిడ్డకే అమ్మఒడి ఇచ్చింది. ఎంత మంది పిల్లలు ఉన్నా మేము తల్లికి వందనం ఇస్తున్నాం' అని సీఎం తెలిపారు. రైతులను అన్ని విధాలా ఆదుకునే ప్రభుత్వం తమది అని సీఎం చంద్రబాబు అన్నారు. ఈ ఏడాది ఎన్నడూ లేనంతగా దిగుబడి వచ్చిందని పేర్కొన్నారు. వ్యవసాయంలో లాభాలు పెరుగుతాయి. పంటలకు ప్రాధాన్యత ఇస్తూ గిట్టుబాటు వచ్చేలా మేం చేస్తున్నాం. రైతుకు ఎక్కువ ఆదాయం రావాలని వాణిజ్య పంటలకు కూడా వెళ్లాం. ఒక్కోసారి తక్కువ రేట్లు కూడా వస్తాయి. అనేక ఇబ్బందులను అధిగమించి ముందుకెళ్తున్నాం' అని సీఎం చంద్రబాబు అన్నారు.

# జగన్‌ను కలిసిన వల్లభనేని వంశీ

**అండగా ఉంటామని హామీ**



అమరావతి,జూలై3( వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని గన్నవరం మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత వల్లభనేని వంశీ మోహన్ కలిశారు. గురువారం తాడేపల్లిలోని జగన్ నివాసానికి వెళ్లిన వంశీ.. కష్ట కాలంలో తనకు అండగా నిలిచినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వంశీ ఆరోగ్య స్థితి గురించి వైఎస్ జగన్ ఆరా తీశారు. ఎప్పుడూ అండగా ఉంటామని జగన్ భరోసా ఇచ్చారు. వల్లభనేని వంశీ వెంట ఆయన సతీమణి పంకజశ్రీ కూడా ఉన్నారు. వల్లభనేని వంశీపై మొత్తం 11 కేసులు నమోదైన విషయం తెలిసిందే. ఫిబ్రవరి 13న హైదరాబాద్‌లో వంశీని ఏపీ పోలీసులు అరెస్ట్ చేశారు. సత్యవర్ధన్ కిడ్నాప్ కేసు, దాడి, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులలో పోలీసులు ఆయన్ను అరెస్ట్ చేశారు. కోర్టు రిమాండ్ విధించడంతో.. విజయవాడ సబ్ జైలులో 137 రోజులుగా రిమాండ్ ఖాదీగా ఉన్నారు. జైల్లో ఉన్న సమయంలోనే వంశీ అనారోగ్యం బారిన పడ్డారు. అన్ని కేసుల్లోనూ కోర్టులో ఊరట దక్కడంతో.. 137 రోజుల తర్వాత జైలు నుంచి బయటకు వచ్చారు. బుధవారం ఉదయం విజయవాడ జైలు నుంచి విడుదలయ్యారు. జైలు నుంచి బయటకు రాగానే వంశీని చూసి ఆయన సతీమణి పంకజశ్రీ ఎమోషనల్ అయ్యారు.

# ప్రధాని మోడీకి ఘనా అత్యున్నత పురస్కారం

**రాబోయే ఐదేళ్లలో భారత్-ఘనాల మధ్య రెట్టింపు వాణిజ్యం**
**ఘనంగా స్వాగతించిన ఘనా అధ్యక్షుడు...పార్లమెంటులో ప్రసంగం**
**భారతదేశంలో 2,500 కంటే ఎక్కువ రాజకీయ పార్టీలు ఉన్నట్లు ప్రకటన**
**ఆశ్చర్య పోయిన పార్లమెంట్ సభ్యులు**







న్యూఢిల్లీ,జులై 3( భరాత ప్రధానికి ఘనమైన స్వాగతం, సత్కారం లభించాయి. ఘనా అత్యున్నత పురస్కారం కూడా ప్రదానం చేసింది. రాబోయే ఐదేళ్లలో భారత్‌- ఘనా దేశాలు వాణిజ్యాన్ని రెట్టింపు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఘనాకు భారతదేశం కేవలం భాగస్వామి మాత్రమే కాదని.. ఇరుదేశాలు కలిసి జోడీగా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నాయని తెలిపారు. భారత కంపెనీలు ఘనాలో దాదాపు 900 ప్రాజెక్టులలో రెండు బిలియన్ డాలర్లు పెట్టుబడిగా పెట్టాయని మోదీ చెప్పుకొచ్చారు. ఐదు రోజుల పర్యటనలో భాగంగా పశ్చిమ ఆఫ్రికాలోని ఘనా దేశంలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ఘనాలో ప్రధాని మోదీకి ఆ దేశ ప్రతినిధులు, ప్రజల నుంచి సాదర స్వాగతం లభిస్తోంది. ప్రధాని మోదీ, ఘనా అధ్యక్షుడు జాన్ డ్రామానీ మహామాతో పలు భాగస్వామ్య అంశాలపై చర్చించారు. ఇండియా.. ఘనాతో యూపీఐ డిజిటల్ చెల్లింపుల విధానాన్ని పంచుకునేందుకు సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా మోదీ చెప్పారు. ఉగ్రవాదం మానవాళికి శత్రువని.. ఇరు దేశాలు స్పష్టం చేశాయని, ఉగ్ర ముప్పును ఎదుర్కోవడంలో పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించినట్లు మోదీ వెల్లడించారు. రక్షణ, భద్రతా రంగంలో ఇరుదేశాలు కలిసి ముందుకు సాగుతాయని మోదీ చెప్పారు. సాయుధ దళాల శిక్షణ, సముద్ర భద్రత, రక్షణ సామాగ్రి సరఫరా, సైబర్ భద్రత తదితర రంగాల్లో భారత్‌-ఘనా దేశాల మధ్య పరస్పర సహకారం పెరుగనున్నదని ప్రధాని మోదీ తెలిపారు. అటు, సంస్కృతి, సాంప్రదాయ వైద్యం తోపాటు పలు రంగాల్లో సహకారాన్ని అందించే నాలుగు ఒప్పందాలపై ఇరు దేశాలు సంతకం చేశాయి. అనంతరం ఘనా పార్లమెంటును సందర్శించి సభ్యులను ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించారు. ఈ గౌరవనీయమైన సభలో ప్రసంగించడం తనకు చాలా గౌరవంగా ఉందన్న మోదీ.. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య ప్రతినిధిగా, 1.4 బిలియన్ల భారతీయుల సద్భావన, శుభాకాంక్షలను తీసుకువచ్చానని అన్నారు. బుధవారం సాయంత్రం తన ప్రియ స్నేహితుడు, అధ్యక్షుడు జాన్ మహామా నుంచి ఘనా జాతీయ అవార్డును స్వీకరించడం హృదయపూర్వక అనుభవమని మోదీ సభకు చెప్పారు. భారతదేశం ప్రజాస్వామ్యానికి తల్లని చెప్పిన మోదీ.. మనకు, ప్రజాస్వామ్యం కేవలం ఒక వ్యవస్థ మాత్రమే కాదన్నారు. ఇది మన ప్రాథమిక విలువలలో ఒక భాగమని చెప్పుకొచ్చారు. భారతదేశంలో 2,500 కంటే ఎక్కువ రాజకీయ పార్టీలు, వివిధ రాష్ట్రాలను పరిపాలించే 20 వేర్వేరు పార్టీలు, 22 అధికారిక భాషలు, వేలాది మాండలికాలు ఉన్నాయని మోదీ చెప్పారు. భారతదేశానికి వచ్చిన ప్రజలను ఎల్లప్పుడూ హృదయపూర్వకంగా స్వాగతించడానికి ఇదే కారణమని ప్రధాని అన్నారు.'ఇవాళ మన దార్శనికుడు, రాజనీతిజ్ఞుడు, ఘనా బిడ్డ డాక్టర్ క్వామే న్క్రుమాకు నివాళులర్పించే గౌరవం నాకు లభించిందని' అన్నారు. ఘనా పర్యటలో ప్రధాని మోదీ ఆ దేశ అత్యున్నత పురస్కారాన్ని అందుకున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విశిష్ట రాజనీతి, ప్రభావవంతమైన ప్రపంచ నాయకత్వానికి గుర్తింపుగా ఆ దేశ అధ్యక్షుడు జాన్ డ్రామణి మహామా చేతుల మీదుగా గౌరవం 'ఆర్డర్ ఆఫ్ ది స్టార్ ఆఫ్ ఘనా' పురస్కారాన్ని అందుకున్నారు. 1.4 బిలియన్ల భారతీయుల తరపున ఈ అవార్డును స్వీకరిస్తున్నానని చెప్పిన మోదీ.. ఈ గౌరవాన్ని భారతదేశ యువత ఆకాంక్షలు, సాంస్కృతిక, సంప్రదా యాలు, వైవిధ్యం, ఇంకా ఘనా - భారత్ మధ్య చారిత్రక సంబంధాలకు అంకితం చేశారు.

# ఉగ్రలింకులపై లోతుగా దర్యాప్తు

**జగన్‌కు జడ్ ప్లస్ భద్రత ఇప్పటికే ఉంది**
**హోంమంత్రి వంగలపూడి అనిత**



విజయనగరం,జులై 3 : జగన్‌కు జెడ్ ప్లస్ కేటగిరి భద్రత కల్పిస్తున్నా తనకు జెడ్ ప్లస్ పద్ధతి కల్పించాలని అడగటం దారుణమని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. జగన్‌ను మించిన దగాకోరు ఈ దేశంలో ఎవరూ లేరని.. ఆయన పక్కనున్న సత్తిబాబు ఇంకా పెద్ద దగాకోరంటూ హోంమంత్రి అనిత తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. విజయనగరం, అన్నమయ్య జిల్లాలోని రాయచోటిలో ఉగ్ర లింకులు బయటపడటంపై హోంమంత్రి వంగలపూడి అనిత స్పందించారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ఈ రెండు జిల్లాల్లో ఉగ్రలింకులు బయటపడటానికి గత ప్రభుత్వ ఉదాసీన వైఖరే కారణమని ఆరోపించారు. ఉగ్ర లింకుల కేసులో అరెస్ట్ అయిన సిరాజ్ తండ్రి పోలీస్ శాఖలో ఉండటం వల్ల దర్యాప్తు మరింత లోతుగా జరుగుతోందని తెలిపారు. రాయచోటిలో ఇద్దరు ఉగ్రవాదుల అరెస్టు నేపథ్యంలో పోలీసు బృందాలు రంగంలోకి దిగి విచారణను ముమ్మరం చేశాయి. అరెస్ట్ అయిన ఉగ్రవాదులు అబూబకర్ సిద్ధిక్ భార్య సైరా బాను, మహమ్మద్ అలీ భార్య షమీమ్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు వారిని విచారించారు. అలాగే ఉగ్రవాది మహమ్మద్ అలీ వరుసకు సోదరుడు మహబూబ్ బాషా బావమరిది జమాల్‌నూ కాప్స్ అదుపులోకి తీసుకుని విచారించారు. అనంతరం ఉగ్రవాదుల భార్యలను పోలీసులు రాయచోటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపర్చారు. ఇరువురికీ 14 రోజులు రిమాండ్ విధించింది న్యాయస్థానం.

# ఉగ్రవాదులు అల్ ఉమ్మా సభ్యులు

**పేలుళ్ల కుట్రలకు ఉపయోగించే ఇఐడి స్వాధీనం**
**ఉగ్రవాదులకు సహాకరించిన వారిపై ఆరా**
**కర్నూలు డీఐజీ కోయ ప్రవీణ్ వెల్లడి**

రాయచోటి,జులై 3 అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఉగ్రవాదుల స్థావరాల ఏర్పాటుపై ముమ్మరంగా దర్యాప్తు కొనసాగిస్తున్నామని కర్నూలు డీఐజీ కోయ ప్రవీణ్ తెలిపారు. నిందితులిద్దరూ 'అల్ ఉమ్మా' ఉగ్రవాదులని తెలిపారు. దేశంలోని మూడు ప్రధాన నగరాల్లో పేలుళ్లకు కుట్ర పన్నినట్లు పేర్కొన్నారు.ఇటీవల రాయచోటిలో ఉగ్రవాదులు అబూబకర్ సిద్ధిఖీ, మహ్మద్ అలీని తమిళనాడు ఐబీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో స్థానిక పోలీసులు విచారణ చేపట్టారు. ఈ కేసుకు సంబంధించిన పలు వివరాలను పోలీసు అధికారులతో కలిసి డీఐజీ వెల్లడించారు.'రాయచోటిలో నిందితులకు సహకరిస్తున్న వారిపై విచారణ చేస్తున్నాం. దాదాపు 50 ఐఈడీలు తయారు చేసే సామగ్రి, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. రకమైన భావజాలం కలిగి ఉంటాయి. 'అల్ ఉమ్మా' దక్షిణ భారత్‌లో అతిపెద్ద ఉగ్రవాద సంస్థ. తమిళనాడు పోలీసుల వివరాల ఆధారంగా దర్యాప్తు కొనసాగిస్తున్నాం. రాయచోటిలో నియామకాలు, శిక్షణ ఇచ్చినట్లు విచారణలో నిర్ధరణ కాలేదు. పేలుడు సామగ్రి ఎలా వచ్చిందనేదానిపై విచారణ చేపడుతున్నాం. ఈ కేసుపై ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు పనిచేస్తున్నాయి. 20 ఏళ్లయినా చట్టం నుంచి తప్పించుకోరనడానికి ఇది నిదర్శనం. పేలుడు పదార్థాల గురించి ఉగ్రవాదుల కుటుంబసభ్యులకు తెలుసా? లేదా? అనేది అనుమానాస్పదంగా ఉంది.

# సంపాదకీయం

## నక్సల్స్ రహిత భారతం సాధ్యమేనా


రానున్న 2026 మార్చి ఆఖరినాటికి దేశంలో మావోయిస్టుల ఉనికి అనేది లేకుండా చేయటమే కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించినట్లు కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్ షా తెగేసి మరీ చెప్పటం పరిశీలిస్తే ఆ నిర్ణయం తిరుగులేనట్లు తేలిపోయిందని చెప్పక తప్పదు. ఈ మేరకు వర్షాకాలంలోనూ నక్సల్ అణచివేత కూంబింగ్ చర్యలు కొనసాగుతాయ ని ఇటీవల ఛత్తీస్‌గడ్‌లో పర్యటించిన మంత్రి అమిత్ షా పేర్కొన్నారు కూడా.కేంద్ర ప్రభుత్వం నక్సల్స్ ఉనికిని పూర్తి గా నిర్మూలించి వచ్చే 2026 మార్చి నాటి కి భారత్‌దేశాన్ని నక్సల్ రహిత భారత్‌గా తీర్చిదిద్దేందుకు ఆపరేషన్ కగార్‌ని ఆఖరి పోరాటంగా రంగంలోకి దించింది. అన్ని విధాల ఆయుధాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, డ్రోన్లు, హెలికాప్టర్లు భారీగా సరఫరా చేసి భారీ సంఖ్యలో వివిధ రక్షణ బలగాలకు చెందిన ఆరితేరిన బృందాలను కేటాయించారు.మావోయిస్ట్ ప్రభావిత ప్రాంతాలైన తెలంగాణ, ఛత్తీస్‌గడ్, జార్ఖండ్, మహారాష్ట్ర రాష్ట్రాల్లోని అరణ్యప్రాంతాల్లోని గుట్టలపైన దాడులు, సర్చ్ ఆపరేషన్‌లు ముమ్మరం చేయటంతో మావోయిస్టులు గుక్క తిప్పుకోలేక పోతున్నట్లు సమాచారం. ఇప్పటికే కొందరు లొంగి పోతామని వస్తున్న వార్తలు కూడా విదితమే.ఈ ఏరివేతలో భాగంగా ఈనెల 26న ఉదయం ఛత్తీస్‌గఢ్‌లో నారాయణ్‌పూర్ జిల్లాలో భ ద్రతా సిబ్బందితో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మహిళా నక్సలైట్లు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మావోయిస్టు ల మాడ్ డివిజన్‌కు చెందిన పెద్ద క్యాడర్ ఉనికి గురించి పోలీసులకు సమాచారం అందడంతో అభుజ్మాడ్ ప్రాంతంలో ఈ ఆపరేషన్ నిర్వహించినట్లు బస్తర్ రేంజి ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ పి.సుందర్‌రాజ్ వెల్లడించటం పరిశీలిస్తే నక్సల్ అణచివేతపై కేంద్ర ప్రభుత్వ కఠిన వైఖరి అర్థమవుతున్నది.మావోయిస్ట్ ప్రభావిత ప్రాంతాల్లో వారిని ఏరి వేసేందుకు జనవరి 2024 నుంచి కేంద్ర హోం మంత్రిత్వశాఖ ప్రారంభించిన ఆపరేషన్ కగార్ (ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్)తో ఛత్తీస్‌గడ్ రాష్ట్రంలోను, ఏఓబీలతోపాటు ఇతర ప్రాంతాల్లో జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్లలో భద్రతా దళాలు 400 మందికి పైగా మావోయిస్టులను కాల్చి చంపాయి. ఈ ఆపరేషన్‌లో కేంద్ర సీఆర్‌పీఎఫ్, సైన్యం, కోబ్రా బెటాలియన్‌తోసహా పలు భద్రతా దళాలు పాల్గొన్నారు. ఇందులో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి వారి రహస్య ప్రదేశాలు, ఆయుధాలు, ఇతర ఆయుధాల సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. గత మే 21న జరిగిన ఎన్‌కౌంటర్‌లో నారాయణపూర్ జిల్లాలో సీపీఐ(మావోయిస్ట్) ప్రధాన కార్యదర్శి నంబాల కేశవ్ రావు అలియాస్ బసవరాజు మరణించిన వారిలో వున్నారు. నక్సలైట్ అనే పదం పశ్చిమ బెంగాల్‌లోని నక్సల్బరి గ్రామం పే రు నుంచి ఉద్భవించింది. 1967లో ఆ గ్రామంలో రైతుల తిరుగుబాటు జరిగిం ది. ఈ ఉద్యమాన్నే 'నక్సలిజం' అన్నారు.అదే సంవత్సరం 1967లో, చారుమజుందార్, కానుసన్యాల్, జంగల్ సంతల్ నేతృ త్వంలోని కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) వర్గం సిలిగురి గ్రూప్ అనే పేరుతో, చైనా కమ్యూనిస్ట్ విప్లవం మాదిరిగానే భారతదేశంలోనూ దీర్ఘకాలిక ప్ర జాయుద్ధాన్ని కొనసాగించాలని ఆ మేరకు మజుందార్ చారిత్రక 8 పత్రాలను రాసుకున్నారు. ఇదే నక్సలైట్ ఉద్యమానికి పునా దిగా మారింది.నవంబర్ 1967లో, సుశితల్ రే చౌదరి నేతృత్వంలోని ఒక బృం దం ఆల్ ఇండియా కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ కమ్యూనిస్ట్ రివల్యూషనరీస్‌ను నిర్వహించింది. మావో జెడాంగ్ ఈ ఉద్యమా నికి సైద్ధాంతిక ప్రేరణను అందించాడు. భారతీయ రైతులు, దిగువ తరగతి గిరిజనులతో కలిసి బలవంతంగా ఉన్నత వర్గా ల ప్రభుత్వాన్ని పడగొట్టాలని ఆయన వా దించారు. మజుందార్ రచనలద్వారా వ్యా పించిన ఈ భావజాలం పట్ల చాలామంది పట్టణ ప్రముఖులూ ఆకర్షితులయ్యారు. ఈ రచనలు మావో, కార్ల్ మార్క్స్, వ్లాదిమిర్ లెనిన్ వంటి కమ్యూనిస్ట్ నాయకులు, సిద్ధాంతకర్తల అభిప్రాయాల నుంచి రాయబడ్డాయి. ఉద్యమం ప్రారంభ సంవత్సరాల్లో, ఒక ఉద్యమకారుడి నియామకం ముఖ్య లక్షణాలు నిస్వార్థత, స్వీయ త్యాగం చేసే సామర్థ్యం అని చారు మజుందార్ నమ్మాడు. అటువంటి నిర్దిష్ట వ్యక్తిత్వాన్ని ఉత్పత్తి చేయడానికి, సంస్థ విద్యార్థులు, యువతను అధికంగా నియమించుకుంది.ఈ కొత్త తిరుగుబాటుదారులలో విధేయత, విప్లవాత్మక వ్యక్తిత్వాన్ని పెంపొందించడంతోపాటు నక్సలైట్లు ఇతర కారణాల వల్ల కూడా యువతను ఎంచుకున్నారు. వీ రు ఎక్కువగా విద్యార్థులు, విద్యావంతులైన యువతను చేర్చడం అవసరం. ఎం దుకంటే వారు మావో జెడాంగ్ కమ్యూనిస్ట్ బోధనలను వ్యాప్తి చేయడంలో పా ల్గొంటారు. వారి స్థావరాన్ని విస్తరించడానికి, ఉద్యమం ఈ విద్యార్థులపై ఆధా రప డింది.కమ్యూనిస్ట్ తత్వాన్ని చదువురాని గ్రామీణ, శ్రామిక-వర్గాలకు కూడా వ్యాప్తి చేయడానికి దీనిని ఉద్దేశించారు. రైతులు, శ్రామిక వర్గాలతో తమను తాము ఏకీకృతం చేసుకోగల యువతను నియమిం చుకోవడం అవసరమని, ఈ దిగువ తరగతి వర్గాల మాదిరిగానే జీవించడం, పనిచేయడం ద్వారా ఈ నియామకాలు గ్రామాలకు, పట్టణ కేంద్రాలకు కమ్యూనిస్ట్ బోధనలను తీసుకెళ్లగలవని మజుందార్ విశ్వసించాడు. క్రాంతికారి ఆదివాసీ మహిళా సంఘటన్ అనేది 1986లో పార్టీ లోపల, పార్టీ రక్షించడానికి లక్ష్యంగా పెట్టుకున్న గిరిజన గ్రామాలలో మహిళలపై తీవ్ర అసమానతను అంగీకరించిన ఫలితంగా ఏర్పడిన అనుబంధ స్త్రీవాద సంస్థ. వారు రైతుల హక్కులతోపాటు బలవంతపు వివాహం, ద్విభార్యత్వం, హింస అనే గిరిజన సంప్రదాయానికి వ్యతిరేకంగా ప్రచారం చేశారు.అయితే, 2004లో అధికారంలోకి వచ్చిన వైఎస్ రాజశేఖరరెడ్డి, అప్పటి హోం మం త్రి జానారెడ్డి ద్వారా మావోయిస్టులను శాంతిచర్చలకు ఆహ్వానించగా, అంగీకరించిన కొన్ని గ్రూపులు హైదరాబాద్‌లోనే మంజీరా అతిథి గృహంలో బసచేసి ప్రభుత్వంతో సుమారు మూడుఊ నాలుగు రో జులు చర్చలు జరిపారు.

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి :మాజీ రాజ్య సభసభ్యులు టీజీ వెంకటేష్



కర్నూలు, జూలై 3 (శ్రీచక్ర): నగరంలోని ఎన్ఆర్ పేటలో ఉన్న భాష్యం ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వన మహోత్సవం ర్యాలీని రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు .గురువారం ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ శ్రావణ్ కుమార్ తో పాటు పాఠశాల బోధన ,బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు మొక్కలను చేత పట్టుకొని ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ తన నివాసంలో మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడాలని చెప్పారు. మొక్కలు నాటి వృక్షాలుగా పెంచడం వల్ల అవి మనిషికి ఎంతో అవసరమైన లక్షల రూపాయల విలువైన ఆక్సిజన్ ను దశాబ్దాల పాటు అందజేస్తాయని చెప్పారు. ప్రకృతిలోని సకల జీవరాసులు ఆరోగ్యంగా ఉండాలంటే మొక్కలు నాటడం ఎంతో అవసరమని ఆయన వివరించారు. అలాగే విద్యార్థులు కూడా విద్యార్థి దశలోనే క్రమశిక్షణ ,అంకిత భావాన్ని పెంపొందించుకొని జీవితంలో ఉత్తమ పౌరులుగా ఎదగాలని చెప్పారు. అనంతరం భాష్యం పాఠశాల ప్రిన్సిపల్ శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ తమ పాఠశాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వన మహోత్సవ ర్యాలీనీ రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ ప్రారంభించడం ఆనందంగా ఉందని తెలియజేశారు. తమ పాఠశాల అభివృద్ధికి ఆయన సంపూర్ణ సహకారం అందజేస్తున్నారని, భవిష్యత్తులో ఆయన సహకారం కొనసాగాలని ఆకాంక్షించారు.

## కర్ణాటకను భయపెడుతున్న హార్ట్ ఎటాక్



బెంగళూరు, జూలై 3, (న్యూస్ పల్స్)ర్ణాటకలో గుండెపోటు మరణాలు కలకలం రేపుతున్నాయి. ముఖ్యంగా యువత గుండెపోటుతో మృతి చెందడం ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో సీఎం సిద్ధరామయ్య స్పందించి, కారణాలు తెలుసుకునేందుకు కమిటీని ఏర్పాటు చేశారు. డాక్టర్ రవీంద్రనాథ్ నేతృత్వంలోని కమిటీ పది రోజుల్లో నివేదిక ఇవ్వనుంది. కొవిడ్ టీకాల ప్రభావం, ఇతర ఆరోగ్య సమస్యలపై అధ్యయనం చేయనున్నారు. ప్రజారోగ్యం కోసం ప్రభుత్వం 'హృదయ జ్యోతి', 'గృహ ఆరోగ్య' పథకాలను అమలు చేస్తోంది. పూర్తి వివరాలు మీ కోసం...కర్ణాటకను హార్ట్ ఎటాక్ భయపెడుతుంది. గత కొన్ని రోజులుగా వరుసగా యువత గుండెపోటుతో మృతి చెందడం స్థానికంగా కలకలం రేపుతుంది. కర్ణాటక యువతలో పెరుగుతున్న గుండెపోటు మరణాల పట్ల ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధ రామయ్య ఆందోళన వ్యక్తం చేశారు. వీటికి కారణాలు గుర్తించి.. ఈ సమస్య పరిష్కారం కోసం ఒక కమిటీని కూడా నియమించారు. గత నెలలో అనగా జూన్‌లో ఒక్క హసన్ జిల్లాలోనే ఇరవై మందికి పైగా గుండెపోటు కారణంగా మరణించడం చర్చనీయాంశంగా మారింది. మంగళవారం నాడు కూడా 27 ఏళ్ల సంజయ్ అనే యువకుడు గుండెపోటుతో చనిపోయాడు.ఈ గుండెపోటు మరణాలకు గల కారణాలు, ఇందుకు పరిష్కారం చూపాలంటూ సీఎం సిద్ధ రామయ్య జయదేవ హృద్రోగ ఆసుపత్రుల డైరెక్టర్ డాక్టర్ రవీంద్రనాథ్‌ను ఆదేశించారు. ఆయన నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీని నియమించారు. పదిరోజుల్లో నివేదిక ఇవ్వాలని సీఎం ఆదేశించారు. దీని గురించి ఎక్స్ వేదికగా సిద్ధ రామయ్య పోస్ట్ చేశారు. యువకుల్లో ఆకస్మిక మరణాలపై సమగ్ర అధ్యయనం చేయాలని ఫిబ్రవరిలోనే ఆదేశాలు జారీ చేశామని సీఎం సిద్ధరామయ్య ఈ సందర్భంగా తెలిపారు. గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారిని పరీక్షించి, సమస్యలను విశ్లేషించాలని కమిటీకి సూచించారు.కొవిడ్ టీకాల ప్రభావం, గుండె సంబంధిత సమస్యలపై అధ్యయనం కొనసాగుతోందని సీఎం వెల్లడించారు. హసన్ జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఆకస్మిక మరణాల వెనుక గల కారణాలను గుర్తించి.. వాటిని నివారించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ సమస్యలను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని బీజేపీ నేతలపై ఆయన మండిపడ్డారు. ప్రజారోగ్యాన్ని పరిరక్షించేందుకు తమ ప్రభుత్వం హృదయ జ్యోతి, గృహ ఆరోగ్య వంటి పథకాలను అమలు చేస్తోందన్నారు.యువత, అమాయక ప్రజల జీవితాలు తమకు చాలా ముఖ్యమని సీఎం సిద్ధరామయ్య ఈ సందర్భంగా స్పష్టం చేశారు. హసన్ జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఈ తరహా ఆకస్మిక మరణాల వెనుక ఉన్న అసలు కారణాలను గుర్తించడానికి ప్రభుత్వం కృషి చేస్తోంది. వాటిని నివారించడానికి కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.డాక్టర్ రవీంద్రనాథ్ మార్గదర్శకత్వంలోని నిపుణుల కమిటీ నివేదిక ఆధారంగా తగిన చర్యలు తీసుకుంటామని సీఎం తెలిపారు. ఛాతిలో నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు ఉంటే వెంటనే దగ్గరలోని ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నిర్లక్ష్యం చేయకుండా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కర్ణాటకలో ఒక్కసారిగా ఇన్ని గుండెపోటు మరణాలు నమోదు కావడం పట్ల జనాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## కడపలో ఘనంగా జరిగిన వైఎస్సార్సీపీ జిల్లా సర్వసభ్య సమావేశం

### హాజరైన ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు నాయకులు

కడవ (బ్రహ్మంగారిమఠం)కడప నగరంలోని రామాంజనేయపురంలో నూతన వైఎస్సార్సీపీ జిల్లా కార్యాలయంలో జిల్లా సర్వసభ్య సమావేశం మరియు "రీ కాల్ చంద్రబాబు" మేనిఫెస్టో కార్యక్రమం గురువారం వైసీపీ అతిరథ మహారథ నాయకుల మధ్య ఘనంగా నిర్వహించబడింది.ఈ సమావేశంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతో పాటు జిల్లా అధ్యక్షులు పి రవీంద్రనాథ్ రెడ్డి , మాజీ డిప్యూటీ సీఎం ఎస్.బి.అంజాద్ భాషా , కడప నగర మేయర్ కె. సురేష్ బాబు , రాజంపేట ,బద్వేల్ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి , దాసరి సుధా , ఎమ్మెల్సీలు డి.సి. గోవింద్ రెడ్డి, రామచంద్రారెడ్డి, రమేష్ యాదవ్, రామసుబ్బారెడ్డి , మాజీ ఎమ్మెల్యేలు రఘురాం రెడ్డి, రాచమల్ల శివప్రసాద్ రెడ్డి కూడా పాల్గొన్నారు.

## పెద్ద రైల్వే స్టేషన్ లో పోలీసుల స్పెషల్ డ్రైవ్

ఏలూరు,గురువారం ఉదయం ఏలూరు నగరంలోని పెద్ద రైల్వే స్టేషన్ లో పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈగల్ టీం ఐజి రవికృష్ణ ఏలూరు జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ ఈగల్ టీం ఈగల్ టీం ఎస్పీ నాగేశ్వరరావు ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ నక్క సూర్యచంద్రరావు ఏలూరు డిఎస్పి శ్రావణ్ కుమార్ ఆర్పిఎఫ్ జి ఆర్ పి పోలీసులు పాల్గొన్నారు. కోరమండల్ ఎక్స్ప్రెస్ రైలులో ఆపరేషన్ విజయ పేరుతో విస్తృత తనిఖీలు నిర్వహించారు. అనంతరం ఈగల్ టీం ఐజి రవి కృష్ణ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఈగల్ టీం ప్రారంభించిన అప్పటినుండి ఇప్పటివరకు 21736 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు ఏజెన్సీ ప్రాంతమైన అల్లూరి సీతారామరాజు జిల్లాలో గంజాయి సాగు చేస్తున్నట్లు గుర్తించామని డ్రోన్ సహాయంతో సాగు చేస్తున్న పంటను గుర్తించి వాటిని నాశనం చేస్తున్నామని తెలియజేశారు స్థానికంగా ఉన్న ప్రజలకు గంజాయి సాగు నేరమని వాటిని చేస్తే చట్టపరమైన కఠిన చర్య తీసుకుంటామనిఇప్పటికే అవగాహన కల్పిస్తున్నామని కొందరిపై కేసులు నమోదు చేశామని ఆయన తెలిపారు ఈగల్ టీం 370 గ్రామాలపై ప్రత్యేకంగ ఉంచిందని వారిలో అనుమతులుగా ఉన్న 359 మందిపై కూడా నిఘా పెట్టిందని ఆయన అన్నారు. ఇక్కడ ఉన్న వీరికి ప్రత్యామ్నాయ పంటలు పెంచుకునేందుకుగాను విత్తనాల సరఫరాను కూడా ప్రభుత్వమే చేస్తుందని ప్రభుత్వం తరఫున ఈగల్ టీం చేస్తుందని తెలిపారు. ఈగల్ టీం ముఖ్య ఉద్దేశం మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దటమేనని అందుకు కావలసిన అడుగులను ఈ విభాగం వేస్తుందని ఆయన స్పష్టం చేశారు. డ్రోన్ల సహాయంతో పోలిసింగ్ నిర్వహించడంతో కొంత ఈ సాగు చేసేవారిలో పూర్తిస్థాయి భయం ఏర్పడిందని ఆయన తెలిపారు అల్లూరి సీతారామరాజు జిల్లాలో గంజాయి పంటను పూర్తిగా ధ్వంసం చేసినప్పటికీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోకి ఒరిస్సా నుండి చిన్నచిన్న మొత్తాలలో గంజాయిని సరఫరా చేస్తున్నట్లు తాము గుర్తించామని వీటిని నిర్మూలించేందుకే రైళ్లల్లో ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నామని ఆయన మరో మారు స్పష్టం చేశారు. గంజాయి అక్రమ రవాణా వాటి నిర్మూలనకు ప్రభుత్వం ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నెంబర్ను ఏర్పాటు చేసిందని ఎవరైనా అనుమానితులు ఉన్న అనుమానం వచ్చిన వెంటనే 1972 నెంబర్ కు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. అలాగే ఈగల్ టీం ఇంకొంచెం ముందడుగు వేసి గంజాయి అక్రమ రవాణా దారుల ఆస్తులను సైతం జప్తు చేస్తుందని ఈ ప్రక్రియ ఇప్పటికే కొనసాగుతుందని కొంతమంది ఆస్తులు ఎప్పటికి జప్తు చేశామని కూడా ఆయన తెలిపారు ఎన్ డి పి ఎస్ యాక్ట్ చాప్టర్ 5 ప్రకారం ఈ కేసులో నమోదు చేస్తున్నామని మరో పదహారు మంది పై కేసులు నమోదు చేసేందుకు రంగం సిద్ధం చేశామని ఆయన తెలిపారు. ఇక వలస కూలీల విషయానికి వస్తే కొందరు వలస కూలీలు వచ్చి వెళ్లే సమయాలలో వారు పనిచేసే యజమానులు వారి సామాగ్రిని తరచుగా తనిఖీ చేస్తూ ఉండాలని ఏమాత్రం అనుమానం వచ్చిన వెంటనే 1972 నెంబర్ కు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. అనంతరం జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ మాట్లాడుతూ ఆపరేషన్ విజయలో భాగంగా ఈగల్ టీం ఏలూరు జిల్లా పోలీసులు జి ఆర్ పి ఆర్ పి ఎఫ్ పోలీసులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించామని తెలియజేశారు. ఏలూరు జిల్లాను మాదకద్రవ్యాల రహిత జిల్లాగా చేసేందుకు తాము పూర్తిగా కృషి చేస్తున్నామని ఆయన తెలియజేశారు ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా అనేక పద్ధతులలో అవగాహన కార్యక్రమాలు చేపట్టామని కూడా ఆయన తెలిపారు. ఏలూరు జిల్లాలో ఇప్పటివరకు 20 కేసులు నమోదు చేశామని వాటిలో 700 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని 45 మందిని అరెస్టు చేసి 11 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశామని తెలిపారు. ఎవరిపైన నా అనుమానం ఉంటే వెంటనే 112 నెంబర్ కు సమాచారం ఇవ్వాలని సూచించారు వారి వివరాలను గోపిక ఉంచుతామని కూడా ఆయన తెలిపారు. విద్యార్థులకు గంజాయిని సరఫరా చేసే వ్యక్తుల వివరాలు తెలిసినట్లయితే తల్లిదండ్రులు వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని కూడా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రెండో పట్టణ సీఐ అశోక్ కుమార్ మూడో పట్టణ సిఐ కోటేశ్వరరావు ఎక్సైజ్ సీఐ ధనరాజు జి ఆర్ పి డి ఎస్ పి రత్నరాజు రైల్వే లైన్ ఇన్స్పెక్టర్ ఎంబి దుర్గారావు ఏలూరు జి ఆర్ పి ఎస్సై సైమన్, ఆర్పిఎఫ్ ఇన్స్పెక్టర్ బెన్నీ ఆర్పిఎఫ్ ఎస్ఐ ధనుష్ ఏఎస్ఐ వివి రత్నం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## మతిస్థిమితం లేని వ్యక్తిని కుటుంబ సభ్యులకు అప్పగింత



మంత్రాలయం, జూలై 3 (శ్రీచక్ర) : మతిస్థిమ్మతిమిలేని వ్యక్తిని కుటుంబ సభ్యులు కు మంత్రాలయం ఎస్సై శివాంజల్ గురువారం అప్పగించారు. ఎస్సై శివాంజల్ తెలిపిన వివరాల మేరకు, మంత్రాలయం మండల పరిధిలోని చెట్నపల్లి గ్రామానికి చెందిన మతిస్థిమితులేని వీరేష్ గత ఐదు సంవత్సరాల క్రితం ఇంటి నుండి రైల్వే మార్గంలో జమ్మూకాశ్మీర్ చేరుకున్నాడు. అక్కడ పశువులు కాపలా కాస్తూ జీవనం కొనసాగించేవాడు. అయితే ఇటీవల కాలంలో పహల్గాంలో ఉగ్రదాడిల కాల్పులు జరిగాయి. ఆ సమయంలో అక్కడి పోలీసులు అతిడిని విచారించగా మంత్రాలయం అని తెలిపాడు. అక్కడ పోలీసులు మంత్రాలయం పోలీస్ స్టేషన్ కు ఫోన్ చేసి వివరాలు సేకరించారు. అనంతరం ఎస్సై శివాంజల్ పూర్తి స్థాయిలో విచారణ జరిపి మంత్రాలయం కు చెందిన వ్యక్తి గా గుర్తించి, జమ్మూ కాశ్మీర్ కు బాధితుడి బంధువు అయిన అడవి రాముడు అనే వ్యక్తిని జమ్మూ కాశ్మీర్ కు పంపి బాధితుని మంత్రాలయం పోలీస్ స్టేషన్ కు రప్పించటం జరిగింది. అనంతరం వీరేష్ ను చెట్నీహళ్లి గ్రామంలోని భాదితుడి భార్య యల్లమ్మ కు అప్పగించినట్లు తెలిపారు. పోలీసులు ఎప్పుడు ప్రజాసేవకు అంకితం అవుతామని ప్రజలు ఏ సమస్య వచ్చినా మా దృష్టికి తీసుకు వస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎస్సై శివాంజల్ తెలిపారు.

## అన్న క్యాంటీన్ లలో భోజనం నాణ్యతగా ఉండాలి:ఇంచార్జి కలెక్టర్ డా.బి .నవ్య



కర్నూలు, జూలై 03 (శ్రీచక్ర): అన్న క్యాంటీన్ లలో భోజనం నాణ్యతగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఇంచార్జి కలెక్టర్ డా.బి .నవ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్లో ఉన్న అన్న క్యాంటీన్ ను ఇంచార్జి కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ అన్న క్యాంటీన్ లో, పరిసరాలలో పారిశుద్ధ్యం ఉండేలా చూసుకోవాలన్నారు. సరైన సమయానికి అన్న క్యాంటీన్లు తెరిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్న క్యాంటీన్ లో భోజనం చేస్తున్న వారితో ఇంచార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ భోజనం నాణ్యత ఏ విధంగా ఉంది, ఏమైనా లోపాలు ఉన్నాయా అని ఆరా తీశారు.. భోజనం బాగుందని వారు సమాధానం ఇచ్చారు.. అయినప్పటికీ నాణ్యతలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా, ఫిర్యాదులు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఇంచార్జి కలెక్టర్ సంబంధిత సిబ్బంది ని ఆదేశించారు.

## మొహరం పండుగలో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవు -ఎమ్మిగనూరు డిఎస్పి ఉపేంద్ర బాబు




మంత్రాలయం, జూలై 3 (శ్రీ చక్ర) : మొహరం పండుగ వేడుకలలో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మిగనూరు డిఎస్పి ఉపేంద్ర బాబు అన్నారు. గురువారం మండల పరిధిలోని రచ్చమర్రి గ్రామంలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొహరం పండుగను ప్రశాంతత వాతావరణంలో జరుపుకోవాలని, అలాకాకుండా పండుగలో చట్ట వ్యతిరేక పనులు పాల్పడితే అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మంత్రాలయం సిఐ రామానుజులు, మాధవరం ఎస్ఐ విజయ్ కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు

## పదోన్నతులు మరింత బాధ్యతను పెంచుతాయి

### పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ

సిద్దిపేట జూలై 3, )పదోన్నతులు జీవన శైలిని మార్చే విధంగా ప్రోత్సాహాన్ని కలిగిస్తాయికానిస్టేబుల్ నుండి హెడ్ కానిస్టేబుల్ గా ప్రమోషన్ పొందిన వారి వివరాలు:టి. రాజేశం, పోలీస్ స్టేషన్ తొగుట,యస్. ఉదయ్ కుమార్, పోలీస్ స్టేషన్ రాయపోల్. కె. సుధాకర్ రెడ్డి, పోలీస్ స్టేషన్ టూ టౌన్. వి. యేసు స్వామి, ఎస్బి సిద్దిపేట్. కె. రవిరాజు, పోలీస్ స్టేషన్ సిద్దిపేట రూరల్. యాదయ్య, సిసిఎస్ సిద్దిపేట. కె. అంజిరెడ్డి, పోలీస్ స్టేషన్ దుబ్బాక.ప్రమోషన్ పొందిన సిబ్బంది మర్యాదపూర్వకంగా పోలీస్ కమిషనర్ కలిసి పుష్పగుచ్చాలు అందజేశారు. పోలీస్ కమిషనర్ అభినందించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ. పోలీస్ శాఖలో పదోన్నతులు మరింత బాధ్యతను పెంచుతాయని అన్నారు, పదోన్నతులు పొందిన పోలీస్ సిబ్బంది మన జిల్లాలో మనము ప్రజల గురించి పనిచేస్తున్నామని రెట్టింపు ఉత్సాహంతో ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. పోలీసు శాఖలో క్రమశిక్షణతో బాధ్యతగా విధుల పట్ల నిబద్ధతతో వ్యవహరించే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు, గౌరవ మర్యాదలు లభిస్తాయని తెలియజేశారు,

## ఈ నెల 6న తొలి ఏకాదశిని పురస్కరించుకొని గీతా ప్రచార ధామం నందు విశేష కార్యక్రమాలు:గీతారత్న డి. వి. రమణ



కర్నూలు, జూలై (శ్రీచక్ర): ఈనెల 6న తొలి ఏకాదశిని పురస్కరించుకొని కర్నూలు పట్టణం ఎన్ ఆర్ పేటలో నెలకొన్న శ్రీ గీతా ప్రచార ధామం నందు విశేష కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు విద్యా ప్రకాశానంద స్వామి గీతా ప్రచార సంఘం అధ్యక్షులు, గీతారత్న పురస్కార గ్రహీత డి. వి. రమణ తెలిపారు. గురువారం గీతా ప్రచార ధామం నందు ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో ఏకాదశికి ఎంతో విశిష్టత ఉన్నదని అందునా తొలి ఏకాదశికి ఇంకా ఎంతో ప్రాధాన్యత ఉన్నదని దీనినే శయన ఏకాదశి అని కూడా పిలుస్తారని, ఇంతటి ప్రాశస్తం కలిగిన విష్ణు రోజుల్లో విష్ణు సంబంధమైన కథలు, పారాయణాలు, అభిషేకాలు, పూజాదికాలు విశేష పుణ్యఫలాన్ని కలిగిస్తాయని, అందుకే ఉదయం 9-00 గంటలకు సామూహిక గోపూజ, విష్ణు సహస్రనామ పారాయణం, సంపూర్ణ భగవద్గీత పారాయణం, ధార్మిక ప్రముఖులచే ప్రవచనాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులందరు ఈ మహత్తరమైన కార్యక్రమంలో పెద్దసంఖ్యలో పాల్గొనగలరని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గీతా ప్రచార సంఘం సభ్యులు ఇల్లూరి రమణ, సింహాద్రి రమేశ్, వాసవీ జగన్నాధ గుప్తా, ప్రచార కార్యదర్శి మహాబలేశ్, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ గ్రహీత, మరియు శ్రీ వేంకటేశ్వర సంగీత నృత్య కళానిలయం నిర్వాహకురాలు బి. నాగమల్లేశ్వరమ్మ, తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## బహిరంగప్రదేశాల్లో మద్యం సేవించి ప్రజలకు అసౌకర్యం కలిగిస్తే చర్యలు

### గత 5 నెలలలో ఓపెన్ డ్రింకింగ్ పై 8,140 కేసులు నమోదు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్



కర్నూలు, జూలై 3 (శ్రీచక్ర): బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ ప్రజలకు ఎవరైనా అసౌకర్యం కల్గిస్తే చర్యలుంటాయని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ గురువారం తెలిపారు. బహిరంగంగా మద్యం సేవించడం చట్టరీత్యా నేరమని, రోడ్లు, నడకదారులు, పార్కులు, వ్యాపార దుకాణ సముదాయాలు, శివారు ప్రాంతాలు మరియు వల్నరబుల్ ఏరియాలలో ప్రజాజీవనానికి ఆటంకం కలిగించే వారి పై పబ్లిక్ న్యూసెన్స్ కింద పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు.జిల్లా వ్యాప్తంగా గత 5 నెలలలో( ఫిబ్రవరి ? 1,976 మార్చి ? 1,041 ఏప్రిల్ ? 1,926 మే ? 1,435 జూన్ -1,762 ) బహిరంగప్రదేశల్లో మద్యం సేవించి, ప్రజా శాంతికి భంగం కలిగించిన వారి పై మొత్తం 8,140 కేసులు నమోదు చేశారని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు.

## ప్రజలకు బ్యాంకింగ్ సేవలు అందించడంలో కెనరా బ్యాంకు ముందు :ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్




కర్నూలు, జూలై 3 (శ్రీచక్ర): కెనరా బ్యాంకు 120 వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ఎస్ ఆర్ రామచంద్రరావు, కర్నూలు నగర ట్రాఫిక్ సిఐ మన్సూరుద్దీన్ కలిసి మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు.గత 120 సంవత్సరాలుగా దేశ ప్రజలకు బ్యాంకింగ్ సేవలు అందించడంలో ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సంస్థ లలో కెనరా బ్యాంకు ముందు స్థానంలో ఉందని సీఐ మన్సూరుద్దీన్ ప్రశంసించారు. లీడ్ బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ కర్నూలు నగర ప్రజలకు అన్ని రకాల బ్యాంకింగ్ సేవలలో ముందుండి కెనరా బ్యాంకు సేవలు అందిస్తుందని తెలియజేశారు ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా తలపెట్టిన ఈ కార్యక్రమంలో కర్నూలు నగరంలో వివిధ చోట్ల ఈ వారం రోజులపాటు మొక్కలు నాటే కార్యక్రమాలు చేస్తున్నారని తెలియజేశారు కర్నూలు జిల్లాలో 34 బ్రాంచ్ లతో అన్ని రకాల బ్యాంకింగ్ సేవలతో కెనరా బ్యాంకు ఎల్లప్పుడూ ముందు స్థానంలో ఉంటుందని, జూన్ ఒకటవ తారీఖు నుంచి సేవింగ్స్ ఖాతాలో నగదు నిల్వల నిర్వహణకు ఎలాంటి చార్జీలు లేవని ఇలాంటి మరెన్నో సేవలు కెనరా బ్యాంకులో ప్రత్యేకంగా ఉన్నాయని జిల్లా ప్రజలు కెనరా బ్యాంకు సేవలను వినియోగించుకోవాలని తెలియజేశారు.

## పార్టీలో కష్టపడే కార్యకర్తలకు పదవులు

### పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి





కర్నూలు, జూలై 3 (శ్రీచక్ర): కర్నూలు జిల్లా వైఎస్ఆర్సీపీ మేధావుల ఫోరం విభాగం వైస్ ప్రెసిడెంట్ గా బి. భీమశంకర్ రెడ్డి, కర్నూలు జిల్లా వైఎస్ఆర్సీపీ మేధావుల విభాగం సెక్రటరీగా లక్ష్మీపురం సత్యం రెడ్డి, కర్నూలు జిల్లా వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా ఎస్. హేమంత్ రెడ్డి మరియు కర్నూలు జిల్లా మైనారిటీ విభాగ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా మొగల్ రోమ్ బేగ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా గురువారం కల్లూరులోని తన నివాసంలో నంద్యాల జిల్లా అధ్యక్షులు మరియు పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, పాణ్యం యువ నాయకుడు కాటసాని శివ నరసింహారెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలతో సత్కరించారు..అనంతరం వారితో మాట్లాడుతూ పార్టీలో కష్టపడే కార్యకర్తలకు పదవులు వస్తాయి.. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కాటసాని రాంభూపాల్ రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో వైయస్ఆర్సీపీ కార్పొరేటర్లు 28వ వార్డు కార్పొరేటర్ నారాయణ రెడ్డి,26 వార్డు కార్పొరేటర్ దండు లక్ష్మీకాంత రెడ్డి, 20వ వార్డు కార్పొరేటర్ లక్ష్మి రెడ్డి, వైఎస్ఆర్సీపీ నాయకులు పెద్దపాడు శ్రీధర్ రెడ్డి, బస్తిపాడు రమణారెడ్డి, మిరాపురం చంద్రశేఖర్ రెడ్డి, శివవరం మహేశ్వర్ రెడ్డి, బాబు రెడ్డి, ఓర్వకల్లు ఎంపీపీ తిప్పన్న,కల్లూరు ఆనంద్ , పాణ్యం నియోజకవర్గం వైఎస్ఆర్సిపి సోషల్ మీడియా ప్రెసిడెంట్ లక్ష్మి ప్రసాద్,నన్నూరు తులసిరెడ్డి మరియు వైఎస్ఆర్సీపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## దోష రహిత ఓటర్ల జాబితా రూపకల్పనకు సహకరించాలి


### కర్నూలు నియోజకవర్గ ఆర్వో, కమిషనర్ యస్.రవీంద్ర బాబు



కర్నూలు, జూలై 3 శ్రీచక్ర): కర్నూలు నియోజకవర్గ ఓటర్ల జాబితాను దోష రహిత జాబితాగా రూపొందించేందుకు సహకరించాలని రిటర్నింగ్ అధికారి, నగరపాలక కమిషనర్ యస్.రవీంద్ర బాబు రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. గురువారం కమిషనర్ ఆయన క్యాంపు కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటరు నమోదు, తొలగింపు, సవరణలు వంటి మార్పు చేర్పులకు ఎన్నికల సంఘం అవకాశం ఇచ్చిందని, రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ సూచనలు తెలుపవచ్చని సూచించారు. ప్రతి నెలా సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని, ఓటర్ల సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. అదేవిధంగా తమ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్ల జాబితా తమకు ఇవ్వాలని పేర్కొన్నారు. సమావేశంలో తహశీల్దార్ రవికుమార్, సూపరింటెండెంట్ సుబ్బన్న, డిప్యూటీ తహశీల్దార్ ధనుంజయ, తదితరులు పాల్గొన్నారు

## కర్నూలు రైల్వే స్టేషన్ , రైళ్లల్లో ఆకస్మిక తనిఖీలు

### ఎవరైనా నిషేధిత గంజాయి, మాదక ద్రవ్యాలు రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం:అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా





కర్నూలు, జూలై 3 (శ్రీచక్ర): ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం గంజాయి, మత్తు పదార్థాల అక్రమ రవాణా నిర్మూలనే లక్ష్యంగా ఈగల్ టీం ఐజి ఆకే రవి కృష్ణ ఉత్తర్వుల మేరకు కర్నూల్ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ లు కర్నూలు పోలీసులకు గురువారం ఆదేశాలు జారీ చేశారు. ఈ సంధర్భంగా కర్నూలు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా కర్నూలు రైల్వేస్టేషన్ లో మీడియాతో మాట్లాడారు. కర్నూలు పోలీసులు , ఈగల్ టీంi , స్పెషల్ పార్టీ పోలీసులు , డాగ్స్ స్క్వాడ్ బృందాలు, రైల్వే ఆర్పీఎఫ్ , జి ఆర్ పి పోలీసులు సంయుక్తంగా గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనకు కర్నూలు రైల్వేస్టేషన్ లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించామన్నారు. కర్ణాటక రాష్ట్రం నుండి ఉత్తరాఖండ్ రాష్ట్రం కు కర్నూలు మీదుగా వెళ్లే యశ్వంతపూర్ ఎనీ యోగి నగరి రిషికేష్ రైలు లో ( ట్రైన్ నెంబర్ 06597 ) జనరల్ బోగి నుండి ఎసి బోగిలను అన్నింటిని తనిఖీలు చేయడం జరిగిందన్నారు. ఎలాంటివి లభ్యం కాలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ తనిఖీలు కొనసాగుతున్నాయన్నారు. జిల్లా కు ఒక ట్రైన్ ను కేటాయించి తనిఖీలు చేయాలని ఆదేశాలున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా గంజాయి, మత్త పదార్దాల నిర్మూలనకు , అక్రమరవాణాను అరికట్టే విధంగా చర్యలు చేపట్టామన్నారు. గంజాయి అక్రమ రవాణా నిర్మూలన కొరకు ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నెంబర్ 1972ను ఏర్పాటు చేశారని, ఈ నెంబర్‌కు సమాచారం అందిస్తే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. అనంతరం కర్నూల్ రైల్వే స్టేషన్ లోని పార్సిల్ కార్యాలయంలో డాగ్స్ స్క్వాడ్ తో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ తో పాటు కర్నూల్ డిఎస్పి బాబు ప్రసాద్, కర్నూల్ టూ టౌన్ సీఐ నాగరాజారావు, అబ్దుల్ గౌస్, గుణశేఖర్ బాబు, కర్నూలు టు టౌన్ ఎస్సై సతీష్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో ఇమామ్ కాశీం సరిగెత్తు

మంత్రాలయం,జూలై 3,(శ్రీచక్ర) : మంత్రాలయంలో మొహరం పండుగ వేడుకల్లో భాగంగా గురువారం ఇమామ్ కాశీం (చిన్న దేవుళ్ల) సరిగెత్తు ఖాజవుశేన్ తాత అధ్వర్యంలో కులమతాలకుఅతీతంగ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మంత్రాలయంలో పీర్ల చావిడి లో కొలువైన ఇమామ్ కాశీంను భక్తులు దర్శించుకుని ,నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా పీర్ల దేవుళ్ల ను వివిద రకాల పుష్పాలతో, పట్టువస్త్రాలతో, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. తెల్లవారుజామున దేవుళ్ల ను పంచాయతీ కార్యాలయం వరకు ఊరేగింపుగా వెళ్లి మరల పీర్ల చావిడి లో ఆశీనులు చేశారు. అలాగే మండలంలోని మాధవరం, మాలపల్లి, కాచాపురం, రాంపురం, చిలకలడోన, కల్లుదేవకుంట, సింగరాజనహల్లి, తుంగభద్ర, వగరూరు, తిమ్మాపురం, సూగురు తదితర గ్రామాల్లో మొహరం పండుగ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు



## ఇన్ఫాన్ జీసస్ చిల్డ్రన్స్ హోమ్ ను తనిఖీ చేసిన న్యాయమూర్తి



కర్నూల్ లీగల్, జులై 3 (శ్రీ చక్ర): కర్నూలు మిలటరీ కాలనీలోని ఇన్ఫాన్ జీసస్ చిల్డ్రన్ హోమ్ ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి బి.లీలా వెంకట శేషాద్రి గురువారం తనిఖీ చేశారు. ఆశ్రమంలోనీ నిరాశ్రయులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆశ్రమంలోని రికార్డులను, పరిశుభ్రతను పరిశీలించారు. అలాగే వారికీ అందుతున్న ఆహార, వైద్య సదుపాయల గురించి అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు ఏమైనా సమస్యలు వస్తే 15100 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేస్తే వెంటనే న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు.


## ఏడాదికాలంలోనే ప్రజలకు సంక్షేమ పథకాలు -టీడీపీ ఇన్ చార్జ్ ఎన్ రాఘవేంద్ర రెడ్డి



మంత్రాలయం , జూలై 3, (శ్రీచక్ర) : ఏడాదికాలంలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏ రాష్ట్రంలో లేనివిధంగా అధ్భుతమైన సంక్షేమ పథకాలు అందిస్తున్నారని మంత్రాలయం టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి ఎన్. రాఘవేంద్రరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని కల్లుదేవకుంట గ్రామంలో సుపరిపాలన లో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలోఎస్ఐ శివాంజుల్, టీడీపీ సీనియర్ నాయకుడు ఎస్ యం గోపాల్ రెడ్డి , మాజీ సర్పంచ్ మాలపల్లి చావిడి వెంకటేష్ , మాజీ జెడ్పీటీసీ లక్ష్మయ్య , కల్లుదేవకుంట సహకార సంఘం డైరెక్టర , కురువ భీమన్న , మంత్రాలయం ఎంపిటిసి బోయ వెంకటేష్ , మాజీ ఎంపిటిసి బావిగడ్డ రాఘన్న, మంత్రాలయం తెలుగు యూత్ వగరూర్ పవన్ కుమార్ , ఐ టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి లింగప్ప , ఈడిగ రాఘన్న , కురువ మల్లయ్య , బైటింటి సుధాకర్ , మంత్రాలయం టీడీపీ టౌన్ ఇన్చార్జి వరదరాజు , మంచాల సొసైటీ సహకార సంఘం డైరెక్టర్ డిసి తిమ్మప్ప , నాయకులు బంగారు నరసింహ , టీడీపీ నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

## అనైక్యతతోనే అనర్ధాలు..కోవర్టులు ఎవరు..

### టిడిపి సీనియర్ నాయకులు సుబ్బరాయుడు మాటలు స్వాగతిస్తున్నాం... కోవర్టులు ఎవరు అన్నది ప్రక్షాళన చేస్తున్నాం.. మాజీ ఎంపీపీ టిడిపి లీడర్ ఎల్ ఈ జ్ఞానేశ్వర్ గౌడ్...



వెల్దుర్తి జులై 03 (శ్రీ చక్ర) : వెల్దుర్తి మండలంలోని టిడిపి నాయకుల అనైక్యతతోనే అనర్ధాలు జరుగుతున్నాయని మాజీ ఎంపీపీ టిడిపి నాయకులు ఎల్ ఈ జ్ఞానేశ్వర్ గౌడ్ అన్నారు. గురువారం తన స్వగృహం నందు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ. .. టిడిపి సీనియర్ నాయకులు బొమ్మరెడ్డిపల్లి సుబ్బరాయుడు తొలి అడుగు ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా విలేకరుల సమావేశంలో మాట్లాడిన అంశాలను నేను స్వాగతిస్తున్నానని మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్ గౌడ్ తెలిపారు. టిడిపి పార్టీలో కోవార్డులు ఎవరున్నారు అన్న సంగతి ప్రక్షాళన చేయబోతున్నామని తెలిపారు. అర్హత గల మనుషులు మాట్లాడితే బాగుంటది కానీ అరహత లేని వ్యక్తులు మాట్లాడితే ఆశాశ్వతంగా ఉందన్నారు. వెల్దుర్తికి మేజర్ సమస్య నీటి సమస్య ఉన్నప్పటికీ వైసీపీ సర్పంచ్ సహకారం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అధికారుల పర్మిషన్ లేకుండా వైసీపీ సర్పంచ్ ఇష్టారాజ్యంగా సిసి రోడ్లు నిర్మాణాలు చేస్తున్నాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సూదేపల్లె జయరాముడు, సిద్ధన గట్టు వెంకటేశ్వర్లు, నాయకంటి హరి సురేంద్ర, దాటిపోగు రాజేష్ , నాయకంటి హరి,వీరభద్రుడు, తదితరులు పాల్గొన్నారు.

## రచ్చమర్రి లో పంచాయతీ నీరు బంద్ -పట్టించుకోని అధికారులు

మంత్రాలయం, జూలై 3(శ్రీచక్ర) : మంత్రాలయం మండల పరిధిలోని రుచుమర్రి గ్రామంలో గత వారం రోజులుగా పంచాయతీ నీరు రాకపోవడం తో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంచాయతీ నీరు రాకపోవడంతో గ్రామంలో ఫిల్టర్ నీరు తాగడానికి కూడా ఇబ్బందిగా ఉందని గ్రామస్తులు వాపోయారు. ఈ విషయమై గత మూడు రోజుల క్రితం రచ్చమర్రి గ్రామ జనసేన నాయకులు ఏసేపు పంచాయితీ కార్యదర్శి కు ఫోన్లో నీటి విషయం ఇబ్బందిపై తెలుపగాస్పందించలేదనితెలిసింది.ఇప్పటికైనాపంచాయతీ అధికారులు, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు రచ్చమర్రి గ్రామంలో పంచాయతీ నీటి సరఫరాచేయాలనికోరుతున్నారు. గ్రామంలో పంచాయతీ నీరుసరఫరా చేస్తున్న బోర్లను వ్యవసాయ పంటలకు వాడుకుంటున్నారని గ్రామస్తులు ఆరోపించారు.



## ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పత్రికా సమావేశం



జీలుగుమిల్లి శ్రీ చక్ర జూలై 03 ఇటువలే పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పై అసత్య కథనాలు ఆరోపణలు చేసిన ట్రూ పాయింట్ పత్రిక ఎండీ పాదం మూర్తి నాయుడు పై పోలీసులు తీసుకున్న చర్యలకు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు హర్షం వ్యక్తం చేశారు.పత్రికకు ఎటువంటి అనుమతులు లేకుండా బెదిరింపులకు పాల్పడిన పాదం మూర్తి నాయుడు కి కాలం చెల్లిందన్నారు.గౌరవ ప్రధానమైన పాత్రికేయ వృత్తిని అడ్డుపెట్టుకొని పలువురుపై అసత్య ఆరోపణలతో పాటు కథనాలను ప్రచురించి బ్లాక్ మెయిల్ పాల్పడటం నిజమైన జర్నలిజానికి మచ్చ తెచ్చే విధంగా ఉ ంటుందన్నారు. ఇటువంటి బ్లాక్మెయిలర్స్ వల్ల నిజమైన జర్నలిస్టులకు కూడా చెడ్డపేరు వస్తుందని ఎమ్మెల్యే అన్నారు. సమాజంలో జర్నలిస్టులు ప్రజలకు ప్రభుత్వానికి వారధి లాగా ఉండాలని, మంచి మంచి సమస్యలను వెలికి తీసి సమాజానికి తోడ్పడాలని ఎమ్మెల్యే అన్నారు. సోషల్ మీడియా వేదికగా అసత్య ప్రచారాలకు తెరలేపితే ఎంతటి వారినైనా ఉపేక్షించమని, యూట్యూబ్ ఛానల్స్ వెబ్ పత్రికల్లో కూడా అసత్యాలను ప్రచురించడం మానుకోవాలని లేదంటే కటకటాల పాలవటం ఖాయమని ఎమ్మెల్యే అన్నారు. మీడియా అంటే అపారమైన గౌరవం అని అన్నారు.ప్రతిపక్షాలకు సంబంధించిన వ్యక్తులు అసత్య ప్రచారాలు చేసి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని అటువంటి వారికి కూడా రాబోయే రోజుల్లో బుద్ధి చెప్పటం ఖాయమని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు.ట్రూ పాయింట్ పత్రిక ఎండి మూర్తి నాయుడు పై పరువు నష్ట ధావాకు కూడా రంగ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

## పట్టిసీమ ఎత్తిపోతల పథకాల మోటార్లు ఆన్ చేసిన మంత్రి నిమ్మల రామానాయుడు,

### పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు.





పోలవరం జులై 3 (శ్రీ చక్ర)పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుండి మోటార్లు ఆన్ చేసి మంత్రి నిమ్మల రామానాయుడు, పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు నీటిని విడుదల చేశారు.అనంతరం పట్టిసీమ డెలివరీ పాయింట్ వద్ద గోదావరికి జలహారతి ఇచ్చారు.గోదావరి వరదలు వచ్చిన నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి గోదావరి జిల్లాలను కృష్ణ డెల్టాకు శాస్త్రి యుక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి పంపులను స్విచ్ ఆన్ చేసి గోదావరి జలాలను కృష్ణ డెల్టాకు విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన జలవనరుల శాఖ మాత్యులు నిమ్మల రామానాయుడు ని పోలవరం ఎమ్మెల్యే దుశ్యాలువతో సత్కరించి పుష్పగుచ్చం అందజేసి ఆహ్వానించారు. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, రాజనగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, ట్రైకర్ చైర్మన్ బొరగం శ్రీనివాస్ మరియు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు


## 170 విమానాలు రద్దు..

### ఇబ్బందుల్లో 30 వేల మంది ప్రయాణికులు




పారిస్: ఫ్రాన్స్‌లో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సిబ్బంది సమ్మె చేస్తున్నారు. దీంతో అక్కడ వందల సంఖ్యలో విమానాలను రద్దు చేశారు( వేలాది మంది ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ర్యాన్‌ఎయిర్ సంస్థ 170 విమానాలను రద్దు చేసింది. దీంతో 30 వేల మంది ప్రయాణికుల హాలీడే ప్రణాళికలు మార్చుకోవాల్సి వచ్చింది. ఫ్రాన్స్‌కు చెందిన రెండు సంఘాలు రెండు రోజుల ధర్నా చేస్తున్నాయి. ఆ దేశంలోని నాలుగో వంతు విమానాలు గ్రౌండ్ అయ్యాయి.పారిస్, నీస్ విమానాశ్రయాల్లో ఎక్కడిక్కడే విమానాలు నిలిచిపోయాయి. యూనియన్ డిమాండ్లు ఆమోదయోగ్యంగా లేవని ఫ్రాన్స్ రవాణా శాఖ మంత్రి ఫిలిప్ టబరాట్ తెలిపారు. ఎయిర్ ట్రాఫిక్ ఉద్యోగుల సమ్మెపై ర్యాన్‌ఎయిర్ సంస్థ ప్రకటన చేసింది. ఫ్రాన్స్‌కు వచ్చిపోయే విమానాలే కాదు.. బ్రిటన్, ఐర్లాండ్, స్పెయిన్, గ్రీస్‌కు వెళ్లే విమానాలకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నట్లు పేర్కొన్నది.

## నేడుస్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ సెంట్రల్ టీం జిల్లాలో పర్యటన





భీమవరం జులై 3,(శ్రీ చక్ర)జిల్లాలో శుక్రవారం నుండి స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ సెంట్రల్ టీం పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారుస్వచ్ఛ సర్వేక్షన్ ఉత్తమ పంచాయతీలు ఎంపికలో భాగంగా జిల్లాలో 25 గ్రామ పంచాయతీలలో శుక్రవారం నుండి స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ సెంట్రల్ టీం పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు.గురువారం కలెక్టరేట్ జిల్లా కలెక్టర్ ఛాంబర్ నందు జిల్లా పంచాయతీ అధికారి రామ్ నాథ్ రెడ్డి ఆధ్వర్యంలో స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ సెంట్రల్ టీం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ని కలిసి మాట్లాడారు. స్వచ్ఛ సర్వేక్షన్ లో భాగంగా టీమ్ గ్రామాలలో సేకరించనున్న అంశాలపై జిల్లా కలెక్టర్ కు వివరించారు. ఈ టీమ్ నేటి నుండి రోజుకి రెండు గ్రామాలు చొప్పున జిల్లాలోని 25 గ్రామాలలో 20 రోజులు పర్యటించనున్నట్లు తెలిపారు. టీమ్ గ్రామాల్లోకి వెళ్లి ప్రజల నుండి అభిప్రాయాలను సేకరించడంతో పాటు గ్రామంలో ప్రతి ఇంటిలో మరుగుదొడ్ల వినియోగం తీరు ఎలా ఉంది, పంచాయితీలు, స్కూళ్లు, సచివాలయాలు, మార్కెట్ సెంటర్లు, మురుగు కాలువలు శుభ్రం చేయడం, ప్రతి ఇంటి నుండి చెత్త సేకరణ, తడి పొడి చెత్త వేరుగా సేకరణ, డంపింగ్ యార్డుకు తరలింపు, ప్లాస్టిక్ నిషేధం, వేస్ట్ మేనేజ్మెంట్, తదితర అంశాలను క్షేత్రస్థాయిలోకి వెళ్లి సమాచారం సేకరిస్తారన్నారు.ఈ సందర్భంలో జిల్లా పంచాయతీ అధికారి రామ్ నాథ్ రెడ్డి, స్టేట్ నోడల్ అధికారి ఎస్.సందీప్, డి పిఆర్ సి ఫీల్డ్ టెక్నికల్ కోఆర్డినేటర్ ఎన్.ఎడ్వర్డ్, ఎస్ డబ్ల్యూ ఎస్ కన్సల్టెన్సీ ఎం.సంతోష్, ఎం.దినేష్, రామకృష్ణ, మధుమతి, తదితరులు ఉన్నారు.

## నూతన వి ఓ పి ఆర్డీ గా పి.శివకుమార్



కోట జూలై 3 (శ్రీచక్ర): కోట ఎంపీడీవో కార్యాలయంలో విఓపిఆరి డ గా బుధవారం పి.శివకుమార్ నూతనంగా బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా ఈవోపీఆర్డిగా బాధ్యతలు చేపట్టిన పి శివకుమార్ మాట్లాడుతూ మండల పరిధిలో ఉన్న పంచాయతీల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.పి.శివ కుమార్ వాకాడు,కోట, సైదాపురం గ్రామాల్లో పనిచేశానని తెలియజేశారు.

## పరిశ్రమల స్థాపనకు అందిన ధరఖాస్తులకు నిర్ణీత గడువులోపుగా అనుమతులను మంజూరు చేయాలి.పరిశ్రమల స్థాపనకు వాట్సాప్ గవర్నెన్స్ సేవలు వినియోగించుకోవాలి...జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



భీమవరం జులై 3( శ్రీ చక్ర )గురువారం జిల్లా కలెక్టరేటు వశిష్ఠ కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా పరిశ్రమలు మరియు ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధ్యక్షతన నిర్వహించారు.తొలుత గత సమావేశంలో చర్చించిన అంశాలపై జిల్లా పరిశ్రమల అధికారి తీసుకున్న చర్యలను సమావేశంలో తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో యువతకు యూనిట్ల స్థాపన, పారిశ్రామిక పెట్టుబడులపై అవగాహన కల్పించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. కొత్తగా పారిశ్రామిక రంగంలోకి అడుగు పెట్టాలనుకున్న వారికి ఆర్థిక ప్రాత్సాహాన్ని అందించేలా బ్యాంకర్లతో సమన్వయం చేయడం జరుగుతుందన్నారు. అసంఘటిత కార్మికులు అందరిని పిఎంజెజెబివై, పి.యం.ఎస్.బి.వై భీమా పథకాలను నమోదు చేసేందుకు సంబంధిత అధికారులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ మనమిత్ర యాప్ 9552300009 ద్వారా పరిశ్రమలకు సంబంధించి అందుబాటులో వున్న సేవలను వినియోగించుకునేందుకు హోర్డింగ్స్, బ్యానర్స్ ద్వారా విస్తృత ప్రచారం చేయాలని ఆదేశించారు.జిల్లాలో మే 27 నుండి ఇప్పటివరకు వివిధ శాఖల అనుమతుల కోసం 465 ధరఖాస్తులు అందగా, వాటిలో 458 దరఖాస్తులను ఆమోదించడం జరిగిందని, మరో 7 ధరఖాస్తులు పరిష్కరించవలసి ఉందన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ప్రోత్సాహం ఎం.ఎస్.ఎం.ఈ వివిధ రాయితీ పాలసీ కింద 24 యూనిట్లకు 49.93 లక్షల రూపాయలు మంజూరుకు అనుమతించడం జరిగిందన్నారు. పిఎంఈజీపి పథకం కింద యూనిట్ల స్థాపనకు 568 దరఖాస్తులను బ్యాంకులకు పంపడం జరిగిందని, 342 యూనిట్లు స్థాపించడం జరిగిందని, మిగిలినవి కూడా త్వరలో ప్రారంభించేలా చర్యలు తీసుకోవలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతిరావు, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజరు ఏ.నాగేంద్ర ప్రసాద్, అగ్నిమాపక శాఖ అధికారి బి.శ్రీనివాసరావు, మోటారు వెహికల్ ఇన్స్పెక్టరు కె.ఎస్.ఎన్ ప్రసాదు, జిల్లా కార్మిక శాఖ అధికారి ఆకన లక్ష్మి, జిల్లా విద్యుత్తు శాఖ అధికారి ఏ.రఘునాథ బాబు, మత్స్యశాఖ సహాయ సంచాలకులు ఆర్ వి ఎస్ వి ప్రసాద్, ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జి.స్వాతి, ఎ పి ఎస్ ఎఫ్ సి డి.అపర్ణ, ఎఫ్ ఎ పి ఎస్ ఐ ఎ మెంబర్ కె.సత్యనారాయణ రాజు, తదితరులు పాల్గొన్నారు.

## నూతన అధ్యక్షులు పలగాటి


### భాస్కర్ రెడ్డిని కలిసిన ఎస్సీ సెల్ అధ్యక్షులు తిరుమూరు



మురళి కోట జూలై 3 (శ్రీ చక్ర): కోట మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గా నూతనంగా ఎన్నికైన పలగాటి భాస్కర్ రెడ్డికీ అభినందన శుభాకాంక్షలు తెలిపేందుకు కోట మండలం లోని టీడీపీ శ్రేణులు భారీ గా కొక్కుపాడు కీ తరలివచ్చి భాస్కర్ రెడ్డి ఇంటి వద్ద బాణా సంచా కాల్చుతూ సంబరాలు జరపడంతో భాస్కర్ రెడ్డి ఇంటి వద్ద కొలహాలంగా సందడిగా మారింది.ఈ నేపథ్యంలో టీడీపీ సీనియర్ నాయుకులు పాదర్తి కోటారెడ్డి , కొనిశెట్టి రమేష్ , పొక్కలి బాలాజీ , ఉప్పల బాలకృష్ణ యాదవ్ ల ఆధ్వర్యంలో ఎస్సి సెల్ అధ్యక్షులు తిరుమూరు మురళి , చిట్టేడుగ్రామానికి చెందిన రామయ్య , ఇన్నమాల అనొక్ ,నెల్లూరు పల్లి కోటేశ్వరరావు, ,పిండి వెంకటకృష్ణయ్య , బల్లెం సుధాకర్ ,చెన్నపట్నం శినయ్య , ఇల్లకూరు పాడు వెంకటేశ్వర్లు , దామవరపు బాబు ,ఆశం రాజ్ కిషోర్ , పసుపులేటి వేణు ,నాను రామచంద్ర రెడ్డి ,జి. చంద్రా రెడ్డి ,పొక్కలి వరుణ్ మరియు టీడీపీ నాయుకులు, కార్యకర్తలతో గురువారం కొక్కు పాడు గ్రామానికి చేరుకొని తెలుగుదేశం పార్టీ కోట మండలం నూతన అధ్యక్షులు పలగాటి భాస్కర్ రెడ్డి నీ మర్యాద పూర్వకంగా కలిసి శాలువా లు కప్పి గజ మాలలతో ఘనంగా సన్మానించి అభినందన శుభాకాంక్షలు తెలిపి బాణా సంచా కాల్చి సంబరాలు జరిపారు.ఈ సందర్బంగా తిరుమూరు మురళి మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుండి పార్టీ ఉన్నతికి పనిచేస్తున్న సౌమ్యులు, మంచి మనస్సున్న నేత పెద్దలు పలగాటి భాస్కర్ రెడ్డి సేవలను గుర్తించిన పెద్దలు, గౌరవ శాసన సభ్యులు డాక్టర్ పాశం సునీల్ కుమార్ కోట మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షు లు గా పలగాటి భాస్కర్ రెడ్డి నీ ఏకగ్రీవంగా ఎన్నిక చేయడం చాలా సంతోషంగా ఉందిన్నారు.అయితే నాడు వైసీపీ అధికారం లో ఉన్నప్పుడు ప్రతి పక్షం లో పెద్ద నాయుకులు లేకున్నా ఎస్సి, ఎస్టీ, బిసి, మైనార్టీ నాయుకులు పని చేశారు. చిన్న చిన్న ఓసి సామజిక వర్గాన్ని కీ చెందిన వారు మాత్రమే పనిచేసారు అనీ గుర్తు చేశారు. నూతనంగా టీడీపీ అధ్యక్షులు ఎన్నికైన భాస్కర్ రెడ్డి ఈ విషయాలు పరిగణ లోకి తీసుకోని పార్టీ కోసం పని చేసిన పెద నాయుకుల ఉన్నతికి కృషి చేయాలనీ కోరారు, కొత్త పట్నం నుండి నేను, అనొక్, అల్లం పాడు లో సుధాకర్, సిద్దవరం లో పిండి వెంకట కృష్ణయ్య, కర్లపూడి లో కోటేశ్వరరావు లు పనిచేసారు. మాకు సపోర్ట్ చేయాలనీ కోరుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం పలువురు మాట్లాడారు. ఈ కార్యక్రమం లో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కోట మండల టిడిపి అధ్యక్షులు పలగాటి.

### భాస్కర్ రెడ్డిని కలిసిన పారిశ్రామికవేత్త దువ్వూరుజనార్దన్ రెడ్డి..., పలగాటి.భాస్కర్ రెడ్డి కి శుభాకాంక్షలు తెలిపిన టిడిపి నాయకులు దువ్వూరు. జనార్దన్ రెడ్డి...,



కోట జూలై 3 (శ్రీ చక్ర) : కోట మండలం కొక్కుపాడు లో నూతనంగా ఎన్నికైన కోట మండల టిడిపి అధ్యక్షులు పలగాటి. భాస్కర్ రెడ్డి ని ప్రముఖ పారిశ్రామికవేత్త టిడిపి నాయకులు దువ్వూరు జనార్దన్ రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.అదేవిదంగా పెద్దలు,సౌమ్యులు,టిడిపి ఆవిర్భావం నుంచి పార్టీ కి విశిష్ట సేవాలం దించిన పలగాటి.భాస్కర్ రెడ్డి కి కోట మండల అధ్యక్ష పదవి రావడం చాలా ఆనందంగా ఉందని దువ్వూరు. జనార్దన్ రెడ్డి తెలిపారు.దువ్వూరు జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో తన అనుచర వర్గంతో కొక్కుపాడు లోని భాస్కర్ రెడ్డి స్వగృహం లో బాణా సంచా కాల్చి,ఘుజమాల,కేక్‌లు కట్ చేసి సంబరాలు జరిపిన జరిపారు.అయితే దువ్వూరు. జనార్దన్ రెడ్డి రాకతో కొక్కుపాడు గ్రామం పండగ వాతావరణం ల మారింది.ఈ కార్యక్రమంలో పలగాటి.జితేంద్ర రెడ్డి, యరటపల్లి వసంత్ కుమార్ రెడ్డి, యరటపల్లి శ్యాంసుందర్ రెడ్డి ,మర్రి పోలయ్య ,కార్తీక్, మస్తాన్,మిాజూరు చంద్ర ప్రకాష్ ,మధు,గురు ప్రసాద్ ,సుబ్బు,బాబు ,శ్రీను ,కిరణ్ టిడిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



## పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో విద్యార్ధికి పాము కాటు

జగిత్యాల,జగిత్యాల జిల్లా పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో పాము సంచారం కలకలం రేపింది. రాత్రి డిన్నర్ సమయంలో హ్యాండ్ వాష్ చేసుకునేందుకు వెళ్ళిన 8వ తరగతి విద్యార్థి నవనీత్ ను విష పురుగు కాటు వేసింది. నవనీత్ కాలుకు రెండు కాట్లు ఉ ండడంతో కోరుట్ల ఆసుపత్రికి తరలించారు. కాటేసింది పామా?, విషపురుగా స్పష్టత లేకపోవడంతో విద్యార్థులు, టీచర్స్ అయోమంలో వున్నారు. కాటుకు గురైన విద్యార్థికి ఎలాంటి ప్రమాదం లేదని వైద్ఉలు స్పష్టం చేసారు. గత ఏడాది పాము కాటుతో ఇద్దరు విద్యార్థులు మృతి చెందారు. మరో ముగ్గురు విద్యార్థులకు ప్రమాదం తప్పింది. డిన్నర్ సమయంలో హ్యాండ్ వాష్ చేసుకునేందుకు వెళ్లినప్పుడు ఏదో కుట్టినట్లు అనిపించిందని వెంటనే టీచర్స్ సమాచారం ఇచ్చానని విద్యార్థి చెబుతున్నాడు.

# నిఘా నీడలో ఎమ్మెల్యేలు

విజయవాడ, జూలై 3, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు కొందరు ఎమ్మెల్యేలపై ఆగ్రహంతో ఉన్నారు. నాన్ సీరియస్ కేటగిరీలోని ఎమ్మెల్యే జాబితా రెడీ అవుతుంది. ప్రజాసమస్యలు పట్టించుకోకుండా ఎమ్మెల్యేగా బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించకుండా సొంత పనులపైనే దృష్టి పెడుతున్న ఎమ్మెల్యేల జాబితాను సిద్ధం చేస్తున్నట్లుసమాచారం. వారు నియోజకవర్గానికి దూరంగా వ్యాపారాలు ప్రధానంగా వ్యాపకం చేసుకుంటూ కాలం వెళ్ల దీస్తున్న ఎమ్మెల్యేలకు సీరియస్ వార్నింగ్ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారని సమాచారం. ఇప్పటికే పార్టీ రాష్ట్ర స్థాయి విస్తృత స్థాయి సమావేశంలో గైర్హాజరయిన ఎమ్మెల్యేలపై ఆగ్రహం వ్యక్తం చేసిన చంద్రబాబు నాయుడు యాభై మంది సమావేశానికి రాకపోవడానికి గల కారణాలను తెలుసుకుని వారిని వ్యక్తిగతంగా పిలిచి క్లాస్ పీకాలని నిర్ణయించారు. . కొందరు సమావేశానికి వచ్చి సంతకాలు చేసి వెళ్లడం కూడా చంద్రబాబు సీరియస్ అయ్యారు. పార్టీ అధినేతగా, ముఖ్యమంత్రిగా తాను సమావేశంలో ఎక్కువ సేపు సమావేశంలో గడిపితే కనీసం కూర్చునే ఓపిక లేని ఎమ్మెల్యేలను ఉపేక్షించడం అనవసరమని భావిస్తున్నారు. ఆధ్యాత్మక పర్యటనలకు, విదేశీ పర్యటనలకు వెళ్లడం మంచిదేనని, అయితే సమయం సందర్భం ఉండాలి కదా అని చంద్రబాబు నేతలను నిలదీసే అవకాశాలు కనిపిస్తున్నాయి. నేటి నుంచి తొలి అడుగు ఇంటింటికి కార్యక్రమం ప్రారంభం కానుండటం, నెల రోజుల పాటు ఈ కార్యక్రమం జరగుతుండటంతో ఇది పూర్తయిన తర్వాత వ్యక్తిగతంగా ఎమ్మెల్యేలను ఒక్కొక్కరిని పిలిచి క్లాస్ పీకే అవకాశాలు కనిపిస్తున్నాయి. . నాటా, అటా సభలకు ముందుగానే అమెరికా ప్రయాణం పెట్టుకున్న వారి విషయంలోనూ చంద్రబాబు ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెలిసింది. అయితే దీంతో పాటు ఇంటింటికి తొలి అడుగు కార్యక్రమంలో ఎలా పాల్గొన్నారన్న దానిపై కూడా నివేదికలు తెప్పించుకునే అవకాశముంది. ఎమ్మెల్యేలు స్వయంగా ఇంటికి వెళుతున్నారా? లేక తమ అనుచరులును పంపుతున్నారా? అన్న దానిపై కూడా నివేదికలు ఎప్పటికప్పుడు కేంద్ర పార్టీ నుంచి నివేదికలు తెప్పించుకునే అవకాశాలున్నాయి. చంద్రబాబు పార్టీ పరమైన కార్యక్రమాలను నిర్లక్ష్యం చేస్తే సహించకూడదని నిర్ణయించుకున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ప్రజలకు అందుబాటులో ఉండని వారిని వదులుకునేందుకు కూడా సిద్ధమని చెబుతున్నారు. ఇప్పటికి ఏడాదే అయింది కాబట్టి.. హెచ్చరికలు జారీ చేస్తున్నారని.. సీరియస్ గా తీసుకోని వారి విషయంలో.. తర్వాత ఎంత ఒత్తిడి చేసినా ప్రయోజనం ఉండదని అంటున్నారు.

# కూటమిలో కుదుపు తప్పదా

విశాఖపట్టణం, జూలై 3, ఆంధ్రప్రదేశ్ భారతీయ జనతా పార్టీ నేతలు అసంతృప్తిగా ఉన్నారని అర్ధమవుతుంది. తమను అస్సలు పరిగణనలోకి తీసుకోవడం లేదని భావిస్తున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత తమను పట్టించుకోవడం లేదని గట్టిగా విశ్వసిస్తున్నట్లుంది. కూటమి ధర్మాన్ని సక్రమంగా పాటించలేదన్న అభిప్రాయం ఎక్కువ మందిలో వ్యక్తమవుతుంది. బీజేపీ నేతలు అసహనం బహిరంగ వేదికలపైన కూడా వినిపిస్తుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భర్తీ అయిన నామినేటెడ్ పదవుల విషయంలోనూ బీజేపీకి అన్యాయం జరుగుతుందని, అదేమంటే తమను తక్కువ ఓటింగ్ శాతం ఉన్న పార్టీగా టీడీపీ పరిగణించడం ప్రధాన కారణంగా కమలం పార్టీ నేతలు చూస్తున్నారు. మొన్నటి ఎన్నికల్లో బీజేపీ మద్దతు లేకపోతే గెలుపు సాధ్యమయ్యేదా? అన్నది పునరాలోచించుకోవాలని కోరుతున్నారు. నామినేటెడ్ పదవుల కోసం తమ పార్టీ కోసం, కూటమి గెలుపు కోసం కష్టపడిన కార్యకర్తలు, నేతలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నా బలం లేదన్న సాకుతో తమకు ఒకటి అరా పోస్టులు ఇవ్వడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఇక ముఖ్యమైన నిర్ణయాల్లో కూడా తమ పాత్ర లేకపోవడాన్ని వారు జీర్ణించుకోలేక పోతున్నారు. కూటమిలో కేవలం టీడీపీ, జనసేన లు మాత్రమే డామినేట్ చేస్తున్నాయని, తమను అస్సలు మిత్రపక్షంగా కూడా పరిగణనలోకి తీసుకోవడం లేదని భావిస్తున్నారు. నేతలు బహిరంగ వేదికలపై బరస్ట్ అవుతున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా మాధవ్ ప్రమాణ స్వీకారం సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు సంచలన కామెంట్స్ చేశారు. బీజేపీ ఓటు బ్యాంకు ఐదు శాతం ఉందని అనడమేంటని, ఇది దారుణమని అన్నారు. బీజేపీ కనుక కూటమిలో ఉండకపోతే పరిస్థితులు ఎలా ఉండేవో రాష్ట్ర ప్రభుత్వానికి తెలియ చెప్పాల్సిన అవసరం ఉందని విష్ణుకుమార్ రాజు కూటమిలో కొంత ఇబ్బందికరమైన పరిస్థితులు నెలకొనేలా చేశాయి. వచ్చే ఏడాది కార్పొరేషన్, మున్సిపాలిటీలు, పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయని అందులో బీజేపీకి ఐదు శాతం కేటాయిస్తామని చెబితే కుదరదని తేల్చిచెప్పారు. దశాబ్దాలుగా కష్టపడుతున్న నాయకులకు సీటు విషయంలో ఎగనామం పెట్టడం కుదరదని ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు స్పష్టం చేశారు. ఇది కూటమి పార్టీలో చర్చనీయాంశమైంది.

# బాలినేని ప్లాన్ ఏంటీ



ఒంగోలు, జూలై 3, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసులు రెడ్డి వైసీపీకి రాజీనామా చేసి జనసేనలో చేరిపోయారు. అయితే తనకు పట్టున్న ఒంగోలు కార్పొరేషన్ కు చెందిన కార్పొరేటర్లను అయితే తనతో పాటు జనసేనలోకి తీసుకు వచ్చారు. అయితే మరికొందరు కీలక నేతలను పార్టీలోకి తీసుకు రావాలన్న ఆయన ఆలోచన మాత్రం కార్యరూపం దాల్చడం లేదని తెలిసింది. కానీ బాలినేని ఆలోచన వేరే విధంగా ఉందని అంటున్నారు. అందుకోసమే ఆయన మౌనంగా ఉన్నారని సమాచారం. బాలినేని శ్రీనివాసులు రెడ్డి జనసేనలోనే ఉండి వచ్చే ఎన్నికల్లో తన అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి సిద్ధమవుతున్నారని తెలిసింది. బాలినేని శ్రీనివాసులు రెడ్డి తిరిగి వైసీపీలో చేరేందుకు మాత్రం సుముఖంగా లేరు జనసేనలోనే ఉండి తిరిగి ఒంగోలు నియోజకవర్గం నుంచి 2029 ఎన్నికల్లో పోటీ చేయడానికి ప్లాన్ సిద్ధం చేసుకుంటున్నారట. బాలినేని శ్రీనివాసులు రెడ్డి కాంగ్రెస్ లో ఉన్నప్పటి నుంచే ప్రకాశం జిల్లాను తన చెప్పు చేతల్లో పెట్టుకుని ఉన్నారు. నాడు పీసీసీ చీఫ్ గా, తర్వాత ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ రాజశేఖర్ రెడ్డికి సమీప బంధువు కావడంతో ఆయన చెప్పిందే మాట.. చేసిందే శాసనం అన్నట్లు ఉండేది. నాటి నుంచి 2019 ఎన్నికల వరకూ బాలినేని శ్రీనివాసులు రెడ్డి చెప్పిన వారికే టిక్కెట్లు దక్కేవి. అందుకే బాలినేని అందరు నేతలతో టచ్ లో ఉంటారు. వారు కూడా బాలినేని ప్రాపకం కోసం పాకులాడేవారు. అలాంటిది 2024 ఎన్నికల్లో ఓటమి తర్వాత బాలినేని వైసీపీకి రాజీనామా చేయడం, తర్వాత జనసేనలో చేరిపోవడం ఆశ్చర్యానికి గురి చేశాయి.. 2026 నాటికి నియోజకవర్గాల పునర్విభజన పూర్తవుతుంది. ప్రస్తుతం ఉన్న రిజర్వ్ డ్ నియోజకవర్గాలు జనరల్ కు మారే అవకాశముంది. ప్రస్తుతం ఒంగోలు టీడీపీ ఎమ్మెల్యేగా ఉన్న దామచర్ల జనార్ధన్ కు బాలినేని శ్రీనివాసులు రెడ్డికి మధ్య పొసగడం లేదు. బాలినేనిని దామచర్ల శత్రువుగానే చూస్తారు. ప్రత్యర్థిగానే పరిగణిస్తానని దామచర్లజనార్ధన్ ఓపెన్ స్టేట్ మెంట్ ఇచ్చారు. జనసేనలో ఉన్న కీలక నేతలు కూడా దామచర్ల జనార్ధన్ వెంట ఉన్నారు. దామచర్ల జనార్ధన్ సొంత ఊరు కొండపి నియోజకవర్గంలో ఉంది. కొండపి ప్రస్తుతం రిజర్వ్ డ్ నియోజకవర్గంగా ఉంది. అక్కడ మంత్రి స్వామి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆ నియోజకవర్గంలో దామచర్ల కుటుంబానికి మంచిపట్టుంది. నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా కొండపి జనరల్ కేటగిరీగా మారితే దామచర్ల జనార్ధన్ ను తెలుగుదేశం పార్టీ అక్కడకు పంపే అవకాశముంది. దామచర్ల జనార్ధన్ కూడా తనకు ఒంగోలు కంటే కొండపి నియోజకవర్గం సేఫ్ అని ఖచ్చితంగా భావిస్తారని బాలినేని లెక్కలు వేసుకుంటున్నారు. అప్పుడు తాను ఒంగోలు నియోజకవర్గం నుంచి జనసేన నుంచి పోటీ చేస్తే ఖచ్చితంగా గెలుస్తానని బాలినేని శ్రీనివాసులు రెడ్డి భావిస్తున్నారు. అందుకే ప్రస్తుతానికి సైలెంట్ గా ఉండాలని జనసేన అధినేత పవన్ కల్యాన్ నుంచి సంకేతాలు రావడంతో ప్రస్తుతం హైదరాబాద్ నుంచి ఒంగోలుకు అప్పుడప్పుడు వచ్చి తన అనుచరులను కలసి చర్చించి వెళుతున్నారు.

# నోటిఫైపై భూ సమీకరణ పథకం నిబంధనలు-2025

విజయవాడ, జూలై 3, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత భూ సమీకరణ పథకం (రూపకల్పన, అమలు) నిబంధనలు–2025ను నోటిఫై చేసింది. ఈ నిబంధనలు నవశక రాజధాని అమరావతిని నిర్మించడానికి భూమిని సేకరించే ప్రత్యేక పద్ధతిని నియంత్రిస్తాయి. ఈ నిబంధనలు 'రాజధాని ప్రాంతానికి' వర్తిస్తాయని, అయితే 'రాజధాని నగరం' ప్రాంతానికి మాత్రం ఆంధ్రప్రదేశ్ రాజధాని నగర భూ సమీకరణ పథకం (రూపకల్పన, అమలు) నిబంధనలు–2015 వర్తిస్తాయని పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్ తెలిపారు.''ప్రభుత్వ సంకల్పం మేరకు 'ప్రజా రాజధాని'ని నిర్మించడానికి, అలాగే విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, ఇతర అవసరమైన అన్ని మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను నిర్మించడానికి, భూసేకరణ యంత్రాంగాన్ని స్వచ్ఛంద పథకంగా రూపొందించాం" అని కుమార్ ఒక ప్రభుత్వ ఉత్తర్వు లో పేర్కొన్నారు. ఇది భూయజమానులు, ప్రభుత్వం/అధికార సంస్థ మధ్య పరస్పర ఏకాభిప్రయంపై ఆధారపడి ఉంటుందని కుమార్ తెలిపారు. భూసేకరణలో ఇది ఒక ప్రత్యేక పద్ధతి అని, దీనికి 'భూ సమీకరణ పథకం' అని పేరు పెట్టారని ఆయన అన్నారు.'భూ సమీకరణ పథకం' నిబంధనలు ప్రభుత్వం అమరావతి, మంగళగిరి, తాడేపల్లి, గుంటూరు, విజయవాడలను కలిపి 'మెగా సిటీ'గా మార్చాలని యోచిస్తున్న సమయంలో వచ్చాయి. ఈ ప్రయత్నం ద్వారా ఇప్పటికే అమరావతి కోసం ప్రభుత్వం వద్ద ఉన్న 54,000 ఎకరాలకు అదనంగా మరో 40,000 ఎకరాల భూమిని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మించాలని ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. 'భూ సమీకరణ పథకం' రాజధాని ప్రాంత అభివృద్ధి కోసం రూపొందింది. ఇందులో రైతులు, యజమానులు లేదా యజమానుల బృందం యాజమాన్యంలోని భూములను ఒక అభివృద్ధి పథకం కింద అధికార సంస్థ ఏకీకృతం చేస్తుంది.సమీకరణ పథకం' అనేది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ ద్వారా రూపొందిన మెరుగైన పథకం. 2013 నాటి భూసేకరణ, పునరావాసం, పునర్నిర్మాణ చట్టంలోని సెక్షన్లు 107, 108 కింద ఇది సాధ్యమైంది.''ఈ పథకం విస్తృత లక్ష్యం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నివాసయోగ్యమైన, సుస్థిరమైన రాజధాని ప్రాంత నిర్మాణంతో ప్రభావితమైన కుటుంబాలకు, అలాగే రాజధాని ప్రాంతంలోని రైతులు, భూయజమానులకు న్యాయం చేయడం. మెరుగైన పరిహారం పొందడానికి, రాష్ట్ర అభివృద్ధి ప్రక్రియలో వారిని భాగస్వామ్యం చేయడానికి కూడా ఇది ఉద్దేశించింది" అని ముఖ్య కార్యదర్శి అన్నారు. భాగస్వాములైన భూయజమానులకు పునర్నిర్మించిన ప్లాట్‌తో పాటు అభివృద్ధి చేసిన మౌలిక సదుపాయాలు, ఇతర ప్రయోజనాలతో సరసమైన పరిహారం లభించేలా ఈ పథకం రూపొందిందని కుమార్ వివరించారు.

# సీనియర్లకు చెక్...

నెల్లూరు, జూలై 3, వైసీపీ యూత్ వింగ్ మీటింగ్ లో జగన్ కీలక వ్యాఖ్యలు చేశారు. త్వరలో తాను పాదయాత్ర చేపట్టబోతున్నానని, అప్పుడు అందర్నీ ప్రత్యేకంగా కలుస్తానన్నారు. యూత్ వింగ్ నేతల అంతిమ లక్ష్యం ఎమ్మెల్యే కావడం అని ఉద్బోధించారు. జనంలోకి వెళ్లి, జనంతో మమేకమై స్థానికంగా బలపడాలన్నారు, సోషల్ మీడియాని వాడుకోవాలన్నారు. ఒకరకంగా ఇటీవల కాలంలో జగన్ పెట్టిన అన్ని మీటింగుల్లోకి ఇదే కాస్త ఆసక్తికరంగా ఉంది. మిగతా నేతలతో మొక్కుబడిగా మాట్లాడి ముగించిన జగన్, యువ నేతలతో మాత్రం పార్టీ భవిష్యత్ ప్రణాళికలు వివరించారు. వచ్చే ఎన్నికల్లో జగన్ సీనియర్లకు చెక్ పెడతారనే భావన కలిగించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడే రాజకీయాల్లో ఎదుగుదలకు మంచి అవకాశం ఉంటుందని యువనేతలకు చెప్పారు జగన్. "ఎదగడం మీ చేతుల్లో ఉంది. మిమ్మల్ని పెంచడం నా చేతుల్లో ఉంది" అని వారిలో ధీమా కల్పించారు. గతంలో తాను పార్టీ పెట్టినప్పుడు అందరూ కొత్తవాళ్లే ఉన్నారని, తనని నమ్మి తనతో నడిచినవారంతా ఉప ఎన్నికల్లో గెలిచారన్నారు జగన్. సీనియర్లకు చెక్.. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు సీనియర్ నేతల ప్రవర్తన ఒకలా ఉంది, అధికారం కోల్పోయిన తర్వాత చాలామంది సైలెంట్ అయ్యారు. పెద్దిరెడ్డి, పేర్ని నాని, అంబటి వంటి ఒకరిద్దరు నేతలు మాత్రం హడావిడి చేస్తున్నారు. మిగతా చాలామంది నేతలు నియోజకవర్గాల్లో ఉండి కూడా, ప్రజల వద్దకు వెళ్లడం లేదు. పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా లేరు. వారి వ్యవహార శైలి జగన్ కు నచ్చడం లేదని తెలుస్తోంది. అధికారంలో ఉన్నప్పుడు సీనియర్లకు పెద్దపీట వేసినా, ప్రస్తుతం వారు పార్టీకోసం ఉపయోగపడటం లేదు అని డిసైడ్ అయ్యారు జగన్. అందుకే పార్టీకి కొత్త రక్తం ఎక్కించేందుకు సిద్ధమయ్యారు. తొలి అడుగు యూత్ అధ్యక్షుడిగా వేయాలని, చివరి అడుగు ఎమ్మెల్యే కావడం అని చెప్పారు జగన్. వైయస్ఆర్ సీపీలో నియోజకవర్గ యూత్ అధ్యక్షుడిగా మొదటి అడుగు వేయండి.. ఎమ్మెల్యేగా పార్టీలో మీ చివరి అడుగు పడుతుంది టార్గెట్ 2029. టీడీపీలో కూడా సీనియర్లకు అవకాశాలు తగ్గాయనే చెప్పాలి. మంత్రి మండలి కూర్పులో సీనియర్లతో పాటు, యువనేతలకు కూడా పెద్దపీట వేశారు సీఎం చంద్రబాబు. ఒకరకంగా యువ నాయకులను తనతో కలుపుకొని వెళ్తున్నారు లోకేష్. వైసీపీలో ఆ పరిస్థితి ఇప్పటి వరకు లేదు. సీనియర్లతోనే జగన్ మాట్లాడుతున్నారు, వారితోనే మీటింగ్ లు పెడుతున్నారు, వారికే అన్ని బాధ్యతలు అప్పగించారు. కానీ ఇటీవల ఆయన వైఖరి మారినట్టుంది. సీనియర్లకు చెక్ పెట్టేందుకు డిసైడ్ అయిన జగన్, యువ నాయకత్వానికి తాజా మీటింగ్ లో భరోసా ఇచ్చారు. ఈరోజు యువనాయకులంతా రేపటి ఎమ్మెల్యేలు అంటూ వారిలో ఆశ కల్పించారు. 2029లో గట్టి పోటీ ఇవ్వాలంటే సీనియర్లు సరిపోరని, యువ నాయకత్వంతోనే ఆ పని అవుతుందని గ్రహించారు జగన్. సీనియర్ నాయకులు ప్రెస్ మీట్లు పెట్టి విమర్శించే లోపు, యువ నాయకులు సోషల్ మీడియాలో హడావిడి చేయగలరు. ఆ తేడాని సరిగ్గా ఉపయోగించుకోవాలని డిసైడ్ అయ్యారు జగన్. మరి యువ నాయకత్వంలో కూడా వారసులకే అవకాశాలు ఉంటాయా, ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేకుండా వచ్చి నిలదొక్కుకున్నవారిని పార్టీలో ఎదగనిస్తారా అనేది వేచి చూడాలి

# జమిలీ జపంలో వైసీపీ నేతలు

తిరుపతి, జూలై 3, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి.. ఏపీ రాజకీయాల్లో వైసీపీ అధ్యక్షుడు జగన్ గౌరవం ఇచ్చే ఇచ్చే అతికొద్ది మంది నాయకుల్లో ఒకరు. కొంత కాలంగా పొలిటికల్ స్టేట్‌మెంట్లకు దూరంగా ఉంటున్నారు పెద్దిరెడ్డి. మాజీ సీఎం జగన్ తరహాలోనే ఆయన జమిలి మంత్రి పఠిస్తున్నారు. 2027 ఫిబ్రవరిలో జమిలి ఎన్నికలు వస్తాయని, వైసీపీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. స్వయంగా కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషే ఆ విషయం చెప్పారని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వ్యాఖ్యానించడం ప్రాధాన్యత సంతరించుకుంది. పెద్దిరెడ్డి వ్యాఖ్యలు ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. పైగా కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారంటూ పెద్దిరెడ్డి చెప్పడం హాట్ టాపిక్‌గా మారింది. జగన్ తరహాలో ఆయన కూడా తొలిసారి జమిలిమంత్రం పఠించడటంతో రాజకీయ వర్గాల్లో జమిలిపై చర్చ మొదలైంది. 2024 ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం పాలైంది. కేవలం 11 సీట్లకు మాత్రమే పరిమితమైంది. అయితే.. సార్వత్రిక ఎన్నికలు పూర్తైన కొన్ని రోజుల తర్వాత నుంచి రాష్ట్రంలో జమిలి ఎన్నికల ప్రచారం జోరందుకుంది. 2027లో జమిలీ ఎన్నికలు రాబోతున్నాయని వైసీపీ నేతలు ఊదరగొడుతున్నారు. పార్టీలో పెద్దాయనగా గుర్తింపు పొందిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కూడాఇప్పుడు అదే చెబుతుండటం హాట్‌టాపిక్‌గా మారింది.అసలు పెద్దిరెడ్డి ఎందుకు ఇలాంటి వ్యాఖ్యలు చేశారన్న చర్చ ఊపందుకుంది. పెద్దిరెడ్డి ఈ సమయంలో జమిలి జపం చేయడానికి ప్రధానంగా రెండు కారణాలు చెబుతున్నారు రాజకీయ విశ్లేషకులు. ఎన్నికల్లో ఘోర పరాజయం చెందడం వైసీపీని సహజంగానే నిరుత్సాహానికి గురిచేసింది. రాష్ట్రంలో కూటమి తిరుగులేని మెజార్టీ ఉండడంతో వలసలు సర్వ సాధారణమయ్యాయి. క్షేత్రస్థాయిలో వాటికి అడ్డుకట్ట వేసేందుకు, క్యాడర్‌లో నైతిక స్థైర్యం నింపేందుకే స్వయంగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఇలాంటి కామెంట్లు చేసి ఉండొచ్చన్న మాట విన్పిస్తోంది. రాష్ట్రంలో టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు సంక్షేమ పథకాలను అందించడంలో విఫలమైందని ఆరోపిస్తోంది వైసీపీ. గత వైసీపీ పాలనలో ప్రతి ఒక్కరికీ తాము ఎన్నో సంక్షేమ పథకాలు అందించగా.. ఇప్పుడు వాటిలో కొన్నింటిని కూడా ప్రస్తుత కూటమి ప్రభుత్వం అమలు చేయలేకపోతోందని జగన్ పదేపదే ఆరోపిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వైసీపీ శ్రేణుల్లో ఉత్సాహం నింపడం కోసమే ఈ మైండ్ గేమ్ అడుతున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.పెద్దిరెడ్డి కావచ్చు.. లేదంటే మరో వైసీపీ నేత కావచ్చు.. ఎవరి కామెంట్లనైనా పక్కన పెడితే జమిలీ ఎన్నికలు 2027లో వచ్చే అవకాశాలు ఉన్నాయా అంటే అదంత సులువేం కాదన్న మాట విన్పిస్తోంది. ఇప్పటికే జనగణనకు సంబంధించి కేంద్రం నోటిఫికేషన్ జారీ చేసింది. జనగణనలోనే కులగణన చేపట్టాలని రాష్ట్రాలను ఆదేశించిందిజనగణన, కులగణన పూర్తి చేసి, పార్లమెంటులో వాటిని ఆమోదించే ప్రక్రియ పూర్తయ్యే సరికి చాలా సమయం పడుతుంది.



పైగా నియోజకవర్గాల పునర్విభజన అంశం ఎలాగూ ఉంది. ఆ ప్రకారం చూస్తే ఏదైనా అద్భుతం జరిగి చకచకా పరిణామాలు జరిగితే తప్ప 2029 వరకు జమిలీ వచ్చే అవకాశామే లేదన్న వాదన వినిపిస్తోంది. ఏపీ సీఎం చంద్రబాబు కూడా అదే చెబుతున్నారు. ఆ క్రమంలో వైసీపీ కార్యకర్తలు, నేతలను ఇతర పార్టీల వైపు వెళ్లకుండా నిలువరించడం, ప్రత్యర్థి పార్టీలపై మైండ్ గేమ్ ఆడడం లక్ష్యంగా వైసీపీ నేతలు ఇలాంటి ప్రకటనలు చేస్తున్నారన్న వాదన బలంగా విన్పిస్తోంది.

# రెడ్ బుక్ లో నెక్ట్స్ ఎవరు...

తిరుపతిచ జూలై3, ఎట్టకేలకు వల్లభనేని వంశీకి బెయిల్ దొరికింది ...140 రోజుల జైలు జీవితానికి మోక్షం లభించింది ...అయితే ఇప్పుడే వంశీని జైలు జీవితం విడిపోతుందా! లేక ఇంకేమైనా ఈ కథలో టెస్టులు ఉంటాయా? అన్న ప్రశ్నలు ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో ఉన్నాయి. అయితే అనవసరంగా నోరు పారేసుకుని, రెడ్ బుక్ బాధితులుగా మారిన అనేక మంది ,ఇప్పటికే కారాగారంలో ఊసలు లెక్కపెట్టి వచ్చారు.... అందులో సినిమా రంగానికి చెందినవారు, పత్రికారంగానికి చెందినవారు, రాజకీయ రంగానికి చెందినవారు అన్న తేడా లేకుండా, ఎవరీ లెక్కలు వాళ్ళకి అప్పజెప్తుంది రెడ్బుక్ ....అయితే అందరికన్నా అగ్ర తాంబూలం ఈ రెడ్ బుక్కులో ఎవరికి అందబోతుంది ....ఇప్పటికీ రేట్ బుక్ లో మొదటి పేజీ మాత్రమే చూస్తున్నారని చెబుతున్న టిడిపి కార్యకర్తల మాటల్లో ఆంతర్యం ఏంటి ? రెడ్ బుక్ లో తదుపరి పేజీల్లో ఎవరెవరి పేర్లు పొందుపరిచి ఉన్నాయి. నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది ...అనే సామెత ఉంది ....పెద్దవాళ్లు ఊరికే అనలేదా మాట ...ఎక్కడైతే అనవసరంగా నోరు పారేసుకుంటామమో ,అక్కడ మన ఉనికికే ప్రమాదం ఏర్పడుతుంది... అని పెద్దలు ముందే గమనించబట్టి ఈ సామెతలు కనిపెట్టి ఉంటారు.... అయితే ఇటీవల రాజకీయాల్లో ఈ మాటను ఎవరు వినడం లేదు సరి కదా, పెడ చెవిన పెడుతున్నారు ... దీంతో వాళ్లు వీళ్ళు అని తేడా లేకుండా, ప్రతి ఒక్కరు సమస్యల్లో ఇరుకుంటున్నారు .. అలాంటి బాపతే గడిచిన కొన్నాళ్లుగా తెలుగు రాష్ట్రాల్లో జైలలో కాలక్షేపం చేస్తున్న నాయకులు... మాజీ ఎంపీ నందిగం సురేష్, సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాస్, సినీ నటుడు పోసాని కృష్ణమురళి, బోరుగడ్డ అనిల్ కుమార్, ఇప్పుడు తాజాగా 140 రోజులు జైలు జీవితానికి బెయిల్ తీసుకున్న వల్లభనేని వంశీ,,, వీరంతా వేరే వేరే కేసుల్లో జైలు జీవితం అనుభవించిన దీనంతటి సారాంశం అధికారంలో ఉన్నప్పుడు నోరు పారేసుకున్నారు అన్న విషయం తెలుగు రాష్ట్రాల్లోని ప్రజలకు తెలియంది కాదు.... అయితే ఇప్పటికీ వల్లభనేని వంశీ జైలు జీవితం కథకు ఫుల్ స్టాప్ పడినట్లేనా లేక ఇతర వ్యవహారాల్లో మళ్ళీ శ్రీకృష్ణ జన్మస్థానం వల్లభనేని వంశీని వెంటాడుతుందా అన్న ప్రశ్న కూడా ఉంది.ఒక్క వల్లభనేని వంశీ నే కాదు,... ఎవరైతే గతంలో నోరు పారేసుకున్నారు వాళ్ళందరికీ శ్రీకృష్ణ జన్మస్థానం రుచి చూపించాలని ప్రయత్నం అయితే గట్టిగానే జరుగుతుంది ....అలాంటప్పుడు ఒళ్ళు ,నోళ్ళ దగ్గర పెట్టుకొని మసులుకోవాలన్న హెచ్చరికలు కూడా వినపడుతున్నాయి... ఈ హెచ్చరికలు విషయం పక్కనపెడితే, ఇప్పుడు రెడ్ బుక్ లోని మొదటి పేజీ నడుస్తుంది ....ఈ రెడ్బుక్ లోని మొదటి పేజీలో ఇంకెన్ని పేర్లు ఉన్నాయి? చివరి పేజీకి వచ్చేసరికి ఎంతమంది నాయకులు జైల్లో మగ్గాల్సి వస్తుంది అన్న చర్చ కూడా జరుగుతుంది ....ఇక తాజాగా వినిపిస్తున్న పేర్లు టిడిపి వర్గాల్లో ఆసక్తి రేకెత్తిస్తుంది... టిడిపి సోషల్ మీడియాలో కొందరి వైసీపీ నాయకుల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి....సీదిరి అప్పలరాజు నుండి ,కొడాలి నాని వరకు ఆ లిస్టులో పేర్లు సోషల్ మీడియాలో హల్చల్ చేస్తున్నాయి. అందులో ప్రముఖంగా వినిపిస్తున్న పేర్లు, సీదిరి అప్పలరాజు , రాంగోపాల్ వర్మ ,శ్రీరెడ్డి మాజీ మంత్రులు,పేర్ని నాని , జోగి రమేష్, అంబటి రాంబాబు విడదల రజిని , మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ లాంటి వారి పేర్లు రెడ్ బుక్ లో ప్రముఖంగా ఉన్నట్లు చర్చ జరుగుతుంది.... అయితే ఇందులో ఇప్పటికే కొంతమందికి,కొన్ని కేసులలో నోటీసులు వచ్చిన, తమకున్న టాలెంట్ ఉపయోగించి కోర్టులకు వెళ్లి కొంత ఉపశమనం పొందారు ...అయితే రాబోయే రోజుల్లో వీళ్ళందరికీ మరోసారి రెడ్బుక్ వ్యవహారాన్ని పరిచయం చేపించాలని టిడిపి శ్రేణులు ఉవ్విల్లు ఊరుతున్నట్లు తెలుస్తోంది.. . చంద్రబాబుకు మైండ్ పోయిందని ట్రీట్మెంట్ చేయించాలని, వయసును కూడా గౌరవించకుండా ఇష్టరాజ్యంగా మాట్లాడిన మాజీ మంత్రి అప్పలరాజు, ఇప్పుడు రెడ్ బుక్ లోని మరో పేజీలో ఉన్నట్లు చర్చ జరుగుతుంది అంతేకాదు వల్లభనేని వంశీకి ఆత్మీయ మిత్రుడు, టిడిపికి గతంలో కొరకరాని కొయ్యగా మారి ఇప్పుడు చడిచప్పుడు లేకుండా అనారోగ్య సమస్యలతో హైదరాబాదులో మకం వేసి ఉంటున్న కొడాలి నాని కి , రెడ్ బుక్కు లో ప్రముఖ పేజీ ఉన్నట్లుగా చర్చ జరుగుతుంది .... దీంతోపాటు టిడిపిపై తీవ్ర పదజాలంతో వ్యాఖ్యలు తో పాటు ఇటీవల పోలీసులపై కూడా దూకుడు ప్రదర్శించిన, మాజీ మంత్రి అంబటి రాంబాబు, జగన్ పర్యటనలో ఇద్దరు వ్యక్తుల మరణాలకు కారణమైన నాయకులకు త్వరలోనే కేసుల చిట్టా పరిచయం కాబోతుందని ప్రచారం జరుగుతుంది

# స్పోర్ట్స్ న్యూస్

## గిల్ కూల్‌గా ఉంటూ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు: సచిన్



హైదరాబాద్: ఒత్తిడిలో కెప్టెన్ గిల్ కూల్‌గా ఉంటూ అద్భుతమైన బ్యాటింగ్‌తో సెంచరీ చేశాడని సచిన్ టెండూల్కర్ ప్రశంసించారు. ఓపెనర్ యశస్వి జైస్వాల్ కూడా మొదటి బంతి నుంచే తన బ్యాటింగ్ అంటే ఏంటో చూపించాడని, పాజిటివ్‌గా ఆడడంతో ఫియర్‌లెస్‌గా కనిపించాడని, బ్యాటింగ్‌లో స్మార్ట్‌తో అగ్రెసివ్ కనిపించడని జైస్వాల్‌ను సచిన్ కొనియాడరు. ఇద్దరు ఇన్నింగ్స్‌లు సూపర్‌గా ఉన్నాయని మెచ్చుకున్నారు. ఇద్దరు కుర్రాళ్లు క్లాసిక్ గేమ్‌తో అదరగొట్టారని పొగిడారు. భారత్-ఇంగ్లాండ్ మధ్య జరుగుతున్న రెండు టెస్టు తొలి ఇన్నింగ్స్ మొదటి రోజు టీమిండియా 85 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 310 పరుగులు చేసింది. శుభ్ మన్ గిల్ సెంచరీ చేయడంతో పాటు యశస్వి జైస్వాల్ 87 పరుగులతో ఔరా అనిపించాడు. ఎడ్జ్‌బాస్టన్‌లో సెంచరీలు చేసిన టీమిండియా బ్యాట్స్‌మెన్ల జాబితాలో గిల్ చేరాడు. ఈ మైదానంలో సచిన్, విరాట్ కోహ్లీ, రవీంద్ర జడేజా, రిషబ్ పంత్‌లు సెంచరీలు చేశారు. ఈ మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ 147 పరుగులు చేసి తొలి స్థానంలో ఉన్నాడు. రెండో రోజు జడేజా, వాషింగ్టన్ సుందర్ మెరుగైన బ్యాటింగ్ చేస్తేనే ఇంగ్లాండ్ పై పైచేయి సాధిస్తామని క్రికెట్ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. తొలి టెస్టులో లోయర్ ఆర్డర్ బ్యాటింగ్ చేయకపోవడంతోనే ఓడిపోయామని నెటిజన్లు విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ టెస్టులో రవీంద్ర జడేజా సెంచరీతో చేయడంతో పాటు సుందర్ హాఫ్ సెంచరీ చేస్తే గెలిచే అవకాశం ఉంటుందని కామెంట్లు వెల్లువెత్తుతున్నాయి.

## బాధ్యతలు రాగానే ఉవ్వెత్తున లేస్తారు: యువీ



హైదరాబాద్: భారత్-ఇంగ్లాండ్ మధ్య జరుగుతున్న రెండో టెస్టులో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సెంచరీ చేయడంతో ఓపెనర్ యశస్వి జైస్వాల్ అద్భుతమైన ఇన్నింగ్స్‌లు ఆడారు. దీంతో ఇద్దరిని టీమిండియా మాజీ ఆటగాడు యువరాజ్ సింగ్ మెచ్చుకున్నారు. బౌలింగ్ అనుకూలంగా ఉన్న పిచ్‌పై అద్భుతంగా బ్యాటింగ్ చేశాడని గిల్‌ను యువీ ప్రశంసించారు. కొందరికి బాధ్యతలు రాగానే ఉవ్వెత్తున లేస్తారని కొనియాడారు. తనలో దాగి ఉన్న నైపుణ్యాలను ప్రదర్శిస్తూ అద్భుతమైన ఇన్నింగ్స్‌లు ఆడుతారని, అదే కోవకు గిల్ వస్తాడని యువీ తెలిపారు. కెప్టెన్‌గా గిల్ రెండు సెంచరీలు చేసి రికార్డు సృష్టించాడని, కామ్‌గా ఉంటూ తొందరపాటు గురికాకుండా పరుగుల దాహం తీర్చుకుంటున్నారని యువీ ప్రశంసల జల్లు కురిపించాడు. భారత్-ఇంగ్లాండ్ మధ్య జరుగుతున్న రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్ మొదటి రోజు టీమిండియా 85 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 310 పరుగులు చేసింది.

## శుభ్‌మన్ గిల్.. అలా చెప్పడానికి నీకు బుద్దుందా గవాస్కర్ ఫైర్



టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌పై దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఐదు టెస్టుల అండర్సన్-సచిన్ ట్రోఫీలో భాగంగా ఇంగ్లండ్‌తో జరుగుతున్న రెండో టెస్ట్‌లో టీమిండియా చైనామన్ బౌలర్ కుల్దీప్ యాదవ్‌ను ఎంపిక చేయకపోవడాన్ని సన్నీ తప్పుబట్టాడు. ఇదేం సెలెక్షన్ అంటూ శుభ్‌మన్ గిల్‌ను మందలించాడు. లోయరార్డర్ బ్యాటింగ్ కోసం కుల్దీప్ యాదవ్‌ను పక్కన పెట్టామని చెప్పిన గిల్ వ్యాఖ్యలపై గవాస్కర్ ఘాటుగా స్పందించాడు. అలా చెప్పడానికి బుద్దుండాలని చివాట్లు పెట్టాడు. బుధవారం ఎడ్జ్‌బాస్టన్ వేదికగా ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో టీమిండియా మూడు మార్పులు చేసింది. శార్దూల్ ఠాకూర్, సాయి సుదర్శన్‌పై వేటు వేసిన టీమిండియా.. జస్‌ప్రీత్ బుమ్రాకు రెస్ట్ ఇచ్చింది. ఈ ముగ్గురికి బదులు నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, ఆకాశ్‌దీప్‌లకు అవకాశం కల్పించింది. టీమ్ సెలెక్షన్‌పై గవాస్కర్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. స్పిన్‌కు సహకరించే ఎడ్జ్‌బాస్టన్ మైదానంలో కుల్దీప్ యాదవ్‌ను ఆడించాల్సిందని అభిప్రాయపడ్డాడు.'కుల్దీప్ యాదవ్‌ను తుది జట్టులోకి తీసుకోకపోవడం నన్ను ఆశ్చర్యపరిచింది. ఎడ్జ్‌బాస్టన్ వికెట్‌పై బంతి కాస్త టర్న్ అవుతుంది. ఇది తెలిసి కూడా కుల్దీప్ యాదవ్‌ను పక్కన పెడుతారా? బ్యాటింగ్ డెప్త్ కోసం కుల్దీప్ యాదవ్‌ను ఆడించడం లేదని చెప్పడం సిగ్గు చేటు. జట్టులోని టాపార్డర్ విఫలమైతే.. వాషింగ్టన్, నితీష్ రెడ్డి 7, 8వ స్థానాల్లో వచ్చి ఏం చేస్తారు? వాళ్లేమి తొలి టెస్ట్‌లో విఫలమైన బ్యాటర్లు కాదు కదా? తొలి మ్యాచ్‌లో మొత్తం 830కి పైగా పరుగులు చేశారు. రెండో ఇన్నింగ్స్‌లో 380 పరుగులు చేయలేక ప్రత్యర్థికి అవకాశం కల్పించారు. బ్యాటింగ్ ఆర్డర్‌ను పటిష్టం చేయడం కాదు. వికెట్లు తీసే బౌలింగ్ విభాగాన్ని సిద్ధం చేసుకోండి.'అని గవాస్కర్ చురకలంటించాడు. టీమిండియా తుది జట్టు ఎంపికపై దిగ్గజ కెప్టెన్ సౌరవ్ గంగూలీ కూడా ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. కుల్దీప్ యాదవ్‌ను తీసుకోవాల్సిందని అభిప్రాయపడ్డాడు. టాస్ గెలిచిన ఇంగ్లండ్ బౌలింగ్ ఎంచుకోవడం ఆశ్చర్యానికి గురిచేసిందన్నాడు. 'ఈ మ్యాచ్‌లో టీమిండియా తమ ఇద్దరు అత్యుత్తమ స్పిన్నర్లతో ఆడుతున్నట్లు నాకు అనిపించడం లేదు. టీమిండియా కుల్దీప్ యాదవ్‌ను తీసుకోకపోవడంతో పాటు ఇంగ్లండ్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకోవడం ఆశ్చర్యానికి గురి చేసింది. భారత్‌కు ఇదే మంచి అవకాశం. వీలైనన్ని ఎక్కువ పరుగులు చేస్తేనే ఈ మ్యాచ్‌లో టీమిండియాకు ఆశించిన ఫలితం దక్కుతుంది.'అని సౌరవ్ గంగూలీ అభిప్రాయపడ్డాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్.. తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 85 ఓవర్లలో 5 వికెట్లకు 310 పరుగులు చేసింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్(216 బంతుల్లో 12 ఫోర్లతో 114 బ్యాటింగ్) అజేయ శతకం చెలరేగగా.. యశస్వి జైస్వాల్(107 బంతుల్లో 13 ఫోర్లతో 87) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. క్రీజులో శుభ్‌మన్ గిల్‌తో పాటు రవీంద్ర జడేజా(67 బంతుల్లో 5 ఫోర్లతో 41 బ్యాటింగ్) ఉన్నాడు.

## రూ.4లక్షలు చాలా తక్కువ.. కోర్టు తీర్పుపై షమీ మాజీ భార్య

టీమ్ ఇండియా క్రికెటర్ మొహమ్మద్ షమీ కి.. కోల్‌కతా హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. భార్య హసిన్ జహాన్ తో పాటు కూతురికి ప్రతి నెలా రూ.4 లక్షలు ఇవ్వాలని ఆదేశించింది. మెయింటేనెన్స్‌లో భాగంగా ఆ అమౌంట్ ఇవ్వాలని కోర్టు తన తీర్పులో పేర్కొన్నది. ఇందులో భార్యకు రూ.1.5 లక్షలు, కూతురికి రూ.2.5 లక్షలు ఇవ్వాలని కోర్టు తన తీర్పులో స్పష్టం చేసింది. కోర్టు తీర్పుపై షమీ ఇప్పటి వరకూ స్పందించకపోగా.. హసిన్ జహాన్ మాత్రం రియాక్ట్ అయ్యారు. ఈ మేరకు కోర్టు తీర్పుపట్ల సంతోషం వ్యక్తం చేశారు. సుదీర్ఘంగా చేసిన పోరాటానికి విజయం దక్కిందన్నారు. అదే సమయంలో రూ.4లక్షలు చాలా తక్కువ అని.. తాము రూ.10లక్షలు డిమాండ్ చేసినట్లు చెప్పారు. కోర్టు తీర్పుతో ఇప్పుడు తన కుమార్తెకు మంచి విద్యను అందించగలనని పేర్కొన్నారు.



అయితే, షమీ స్థాయి, అతడి జీవన విధానం, సంపాదనకు ఈ భరణం చాలా తక్కువ అని పేర్కొన్నారు. తాము అతడి నుంచి నెలకు రూ.10లక్షలు ఇప్పించాలని గతంలోనే కోర్టుకు విజ్ఞప్తి చేసినట్లు గుర్తు చేశారు. అప్పటి నుంచి ఆదాయం, ఖర్చులు పెరిగాయని, షమీ ఎలా జీవితాన్ని గడుపుతున్నారో.. తానూ, తన కూతురు కూడా అదే రీతిలో కొనసాగించే హక్కు ఉందని ఆమె పేర్కొన్నారుషమీ-హసీన్ 2014లో వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. వీరికి ఒక కుమార్తె ఉంది. అయితే ఈ దంపతుల మధ్య మనస్పర్థలు తలెత్తడంతో విడిపోవాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో 2018లో షమీపై హసీన్ గృహ హింస, దాడి, వరకట్న వేధింపులు వంటి ఆరోపణలు చేసింది. ఈ విషయమై హసీన్ కోర్టును ఆశ్రయించింది. దీంతో షమీపై దాడి, హత్యాయత్నం, గృహ హింస తదితర అభియోగాలపై కేసు నమోదైంది. ఈ క్రమంలోనే 2019 ఆగస్టులో కోల్‌కతాలోని అలిపోర్ కోర్టు.. క్రికెటర్‌పై అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. అయితే దీన్ని షమీ సెషన్స్ కోర్టులో సవాల్ చేయగా.. అరెస్టు వారెంట్, క్రిమినల్ విచారణ ప్రక్రియపై స్టే విధిస్తూ 2019 సెప్టెంబర్‌లో సెషన్స్ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఇదిలా ఉండగా.. షమీపై గృహహింస కేసు నమోదు చేసినప్పుడు.. తనకు భరణం కింద నెలకు రూ.10 లక్షలు ఇవ్వాలని ఆమె కోర్టులో కేసు వేసింది. అందులో రూ.7 లక్షలు తన ఖర్చుల నిమిత్తం కాగా, మరో రూ.3 లక్షలు కుమార్తె కోసమని పేర్కొంది. దీనిపై ఈ ఏడాది జనవరిలో విచారణ జరిపిన కోల్‌కతా హైకోర్టు.. హసీన్ (ఊజీబతిని ఏజీప్రజీని)కు భరణం కింద ప్రతి నెలా రూ.1.30లక్షలు చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో రూ.50వేలు హసీన్‌కు కాగా, మరో రూ.80వేలు కుమార్తె బాగోగుల కోసం చెల్లించాల్సిందిగా ఉత్తర్వుల్లో ఆదేశించింది.

## పాక్ హాకీ జట్టును అడ్డుకోం: కేంద్ర క్రీడాశాఖ



న్యూఢిల్లీ: వచ్చే నెలలో ఆసియాకప్ హాకీ టోర్నమెంట్ జరగనున్నది. ఆ టోర్నీలో ఆడేందుకు పాకిస్థాన్ హాకీ జట్టు రానున్నది. అయితే ఇటీవల ఇండియా, భారత్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో పాకిస్థాన్ హాకీ జట్టుకు అనుమతి ఇస్తారా లేదా అన్న అంశం చర్చకు దారి తీసింది. ఆసియాకప్ టోర్నీలో పాకిస్థాన్ హాకీ జట్టును అడ్డుకోబోమని కేంద్ర క్రీడాశాఖ వర్గాలు తెలిపాయి. భారత్‌లో నిర్వహించే బహుళ జాతి పోటీల్లో పాల్గొనే జట్లను తాము ఏమీ అడ్డుకోవడం లేదని క్రీడా వర్గాలు పేర్కొన్నాయి.. కానీ ద్వైపాక్షిక టోర్నీ అంశంలో నిర్ణయం మరోలా ఉంటుందన్నారు. అంతర్జాతీయ క్రీడా ప్రమాణాలను బట్టి తాము వెనక్కి తగ్గడంలేదన్నారు. రష్యా, ఉక్రెయిన్ దేశాలు యుద్ధంలో ఉన్నా.. కచ్చితంగా ఆ రెండు జట్లు బహుళ ప్రయోజనాల ఈవెంట్లలో పాల్గొంటాయన్నారు. బీహార్‌లోని రాజ్‌గిర్‌లో ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 7వ తేదీ వరకు ఆసియాకప్ హాకీ టోర్నీ జరగనున్నది. సెప్టెంబర్‌లో జరిగే ఆసియాకప్ క్రికెట్ టోర్నీలో పాకిస్థాన్ ఆడుతుందా లేదా అన్న ప్రశ్నకు బదులిస్తూ బీసీసీఐ ఇంకా దీనిపై నిర్ణయం తీసుకోలేదన్నారు. బీసీసీఐ మమ్మలను సంప్రదించినప్పుడు దానిపై అప్‌డేట్ ఇస్తామని కేంద్ర క్రీడా శాఖ చెప్పింది.

## రెండోరోజు కొనసాగుతున్న ఆట.. కెరియర్‌లో 23వ హాఫ్ సెంచరీ చేసిన జడేజా..!



ఇంగ్లాండ్‌తో జరుగుతున్న రెండోటెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో భారత జట్టు ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా 80 బంతుల్లో హాఫ్ సెంచరీ చేశాడు. టెస్టు కెరీర్‌లో ఇది 23వ హాఫ్ సెంచరీ కావడం విశేషం. మ్యాచ్‌లో జడేజా-శుభ్‌మన్ గిల్ ఇప్పటి వరకు ఆరో వికెట్ వంద పరుగులకుపైగా భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. దాంతో భారత్ 320 పరుగుల స్కోర్ చేయగలిగింది. ప్రస్తుతం గిల్ 115 పరుగులతో, జడేజా 42 పరుగులతో క్రీజులో ఉన్నారు. మ్యాచ్ తొలిరోజు బుధవారం టీమిండియా 85 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 310 పరుగులు చేసిన విషయం తెలిసిందే. లీడ్స్ తర్వాత, ఎడ్జ్‌బాస్టన్ టెస్ట్‌లో కూడా కెప్టెన్ గిల్ సెంచరీ చేశాడు. ఇంగ్లండ్‌తో వరుసగా మూడు టెస్టు మ్యాచుల్లో సెంచరీ చేసిన ఐదో ఇండియన్ ప్లేయర్‌గా నిలిచాడు. మొహమ్మద్ అజారుద్దీన్, రాహుల్ ద్రవిడ్ వంటి దిగ్గజాల రికార్డులను సమం చేశాడు. గిల్ టెస్ట్ కెరీర్‌లో ఏడవ సెంచరీని 199 బంతుల్లో పూర్తి చేశాడు. ఇటీవల గిల్ ఫుల్ ఫామ్‌లో కొనసాగుతున్నాడు. ఇంగ్లండ్‌తో జరిగిన చివరి టెస్టులోనూ సెంచరీ చేసిన విషయం తెలిసిందే. ఇంతకు ముందు 2024లో, ఇంగ్లాండ్ జట్టు ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ కోసం భారత్‌కు వచ్చిన సమయంలో ధర్మశాలలో జరిగిన మ్యాచ్‌లో గిల్ 110 పరుగులు చేశాడు. ఈ క్రమంలో ఇంగ్లాండ్‌పై వరుసగా మూడు సెంచరీలు సాధించిన ఐదో ప్లేయర్‌గా నిలిచాడు. అలాగే ఇంగ్లాండ్‌పై వరుసగా రెండవ సెంచరీ సాధించిన మూడవ భారత కెప్టెన్‌గా రికార్డులకెక్కాడు. ఇంతకు ఈ ఘనతను విజయ్ హజారే, మొహమ్మద్ అజారుద్దీన్ సాధించారు. ఇద్దరూ ఢిల్లీ, బ్రబోర్న్ (1951-52), లార్డ్స్, ఓల్డ్ ట్రాఫోర్డ్ (1990)లలో ఈ ఘనతను సాధించారు.

## కారు ప్రమాదంలో ప్రఖ్యాత ఫుట్‌బాల్ ప్లేయర్ డియాగో జోటా మృతి


జమోరా : లివర్‌పూల్ జట్టు తరపున ఆడే ప్రఖ్యాత పోర్చుగీస్ ఫుట్‌బాల్ ప్లేయర్ డియాగో జోటా కారు ప్రమాదంలో మృతిచెందాడు. స్పెయిన్‌లోని జమోరాలో ఆ ప్రమాదం జరిగింది. ఆ దుర్ఘటనలో అతని సోదరుడు ఆండ్రే ఫిలెపి కూడా ప్రాణాలు కోల్పోయాడు. లాంబోర్గిని కారులో వెళ్తున్న సోదరులు.. మరో కారును ఓవర్‌టేక్ చేస్తున్న సమయంలో టైరు పేలింది. దీంతో కారులో మంటలు వ్యాపించాయి. అక్కడికక్కడే ఆ ఇద్దరూ మృతిచెందినట్లు డాక్టర్లు తెలిపారురెండు వారాల క్రితమే జోటా పెళ్లి చేసుకున్నాడు. తన జీవిత భాగస్వామి రూటో కార్డోసోను అతను పెళ్లాడాడు. ఆ జంటకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. జూన్ 22వ తేదీన ఆ ఇద్దరికీ మ్యారేజ్ జరిగింది. గత ఏడాది లివర్‌పూల్ జట్టు ఫుట్‌బాల్ ప్రీమియర్ లీగ్ టైటిల్ నెగ్గిన విషయం తెలిసిందే. ఆ జట్టులో జోటా సభ్యుడే. పోర్చుగల్ జాతీయ జట్టు తరపున కూడా జోటా ఆడాడు. ఆ దేశం యూఈఎఫ్ఏ టోర్నీ గెలవడంలో అతను కీలక పాత్ర పోషించాడు. ఫార్వర్డ్ ప్లేయర్‌గా జోటాకు మంచి రికార్డు ఉన్నది.



# మొటిమలు, మచ్చలు, స్కిన్ ట్యాన్, స్కార్స్ అన్నింటికి ఒకటే పరిష్కారం బంగాళదుంప




బంగాళాదుంపలు వంటలు అంటే చాలా మందికి ఇష్టం. ముఖ్యంగా నార్త్ ఇండియన్స్ పొటాటో లేనిది వంట వండరు. అంత ఫేమస్. పొటాటోను మ్యాష్ చేసి, ఉడికించి, కాల్చి, రోస్ట్ చేసి వివిధ రకాల వంటలను వండుతారు. బంగాళాదుంపలలో ఖనిజాలు, విటమిన్లు మరియు డైటరీ యాంటీఆక్సిడెంట్ పుష్కలంగా ఉన్నాయి. అంతే కాదు బంగాళాదుంపలు ఆరోగ్యానికి వివిధ రకాల ప్రయోజనాలను అందిస్తాయి. ఇంకా చర్మం క్లియర్ గా మెరుస్తు ఉండటానికి సహాయపడతాయి. బంగాళాదుంపలతో తయారు చేసిన బేస్ ప్యాక్‌లు చర్మ రంధ్రాలను మరియు మచ్చలను కనబడనివ్వకుండా చేయడానికి, మొటిమలను శాస్వతంగా నివారించడానికి సహాయపడతాయి. బంగాళాదుంప-టమోటో ఫేస్ ప్యాక్ ప్యాక్ బంగాళాదుంప-టమోటో ఫేస్ ప్యాక్ ప్యాక్ బంగాళాదుంపలలోని యాంటీఆక్సిడెంట్లు చర్మంలోని హానికరమైన అంశాలను ఎదుర్కోవడానికి సహాయపడతాయి. ఇది సూక్ష్మక్రిములు మరియు బ్యాక్టీరియాను నాశనం చేస్తాయి. బంగాళాదుంపలోని ఆమ్లత్వం చర్మంలో రంధ్రాలను తెరిచి ఉంచి ఉంచి శుభ్రపరచడానికి మరియు క్లియర్ స్కిన్ పొందడానికి సహాయపడుతుంది. కావల్సినవి . చెంచా బంగాళాదుంప పేస్ట్ లేదా రసం . ఒక చెంచా తేనె . చెంచా టమోటా పేస్ట్ లేదా రసం విధానం: . ఒక గిన్నెలో బంగాళాదుంపలు మరియు టమోటా పేస్ట్ ల రసం కలపండి. . ఈ మిశ్రమానికి తేనె జోడించి పేస్ట్ తయారు చేసుకోండి. . ఈ మిశ్రమాన్ని మీ ముఖం మీద సమానంగా రాయండి. . 15-20 నిమిషాలు అలాగే ఉంచండి. . తర్వాత మీ ముఖాన్ని చల్లటి నీటితో కడగాలి. . మొటిమలు కనిపించకుండా మాయమయ్యే వరకు మీరు రోజుకు ఒకసారి ఈ ఫేస్ ప్యాక్‌ని ఉపయోగించవచ్చు. ముఖంలో మచ్చలను వదిలించుకోవడానికి ముఖంలో మచ్చలను వదిలించుకోవడానికి బంగాళాదుంపలతో పాటు ముల్తానీ మిట్టి, చర్మం రంగు మెరుగుపరుస్తుంది మరియు చర్మం రంగు పాలిపోవడాన్ని తగ్గించడానికి సహాయపడతాయి. ముల్తానీ మిట్టి మరియు బంగాళాదుంప మిశ్రమం క్రమంగా మొటిమలు, సన్ టానింగ్ ను నివారిస్తుంది మరియు ముఖంలో కణితులను తొలగించడానికి సహాయపడుతుంది. అయితే వీటిని అతిగా వాడటం మానుకోవాలి. లేకపోతే చర్మం ఎక్కువ డ్రైగా మారుతుంది. కావలసినవి . ఒక బంగాళాదుంప . ఒక చెంచా ముల్తానీ మిట్టి విధానం . పచ్చి బంగాళాదుంపలు తీసుకొని తురిమి దాన్నుండి రసం తియ్యండి. . ఈ సారానికి, ముల్తానీ మిట్టి ఒక చెంచా జోడించండి. . రెండింటినీ కలిపి పేస్ట్ తయారు చేసుకోండి. . ఈ పేస్ట్ ను మీ ముఖానికి రాయండి. . 15-20 నిమిషాలు అలాగే ఉంచండి. . తర్వాత మీ ముఖాన్ని చల్లటి నీటితో కడగాలి. . వారానికి రెండుసార్లు కంటే ఎక్కువ వాడకండి. ముఖంలో మచ్చలను తొలగించడానికి ముఖంలో మచ్చలను తొలగించడానికి స్ట్రాబెర్రీ పండ్లలో ఫోలిక్ ఆమ్లం మరియు విటమిన్ సి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి చర్మాన్ని పూర్తిగా శుభ్రపరిచి, బ్యాక్టీరియాను నాశనం చేయడంలో ప్రత్యేకతంగా సహాయపడుతుంది. స్ట్రాబెర్రీలను బంగాళాదుంపలతో కలిపి ఉపయోగించడం వల్ల ముఖంపై ఉన్న సున్నితమైన సన్నని గీతలు తగ్గుతాయి, మచ్చలు తొలగిపోతాయి మరియు మొటిమలతో ఏర్పడ్డ మచ్చలను తగ్గిస్తాయి. ఇది కొల్లాజెన్ ఉత్పత్తిని కూడా పెంచుతుంది. అలాగే చర్మం యవ్వనంగా కనిపిస్తుంది. కావలసినవి . తరిగిన బంగాళాదుంప . సగం చెంచా తేనె . 2 స్ట్రాబెర్రీలు విధానం . తరిగిన బంగాళాదుంపలు, స్ట్రాబెర్రీలు మరియు తేనె కలపండి. . ఈ పేస్ట్‌ను ముఖం మరియు మెడపై రాయండి. . మీ ముఖం 20 నిమిషాలు పొడిగా ఉండనివ్వండి. . తర్వాత ముఖాన్ని చల్లటి నీటితో కడగాలి. . వారానికి రెండు లేదా మూడు సార్లు వాడటం మంచి పరిష్కారం. చర్మంలో ట్యానింగ్ తగ్గించడానికి, మొటిమలు మరియు మచ్చలను నివారించడానికి చర్మంలో ట్యానింగ్ తగ్గించడానికి, మొటిమలు మరియు మచ్చలను నివారించడానికి పసుపులో ఉండే యాంటీ బాక్టీరియల్ లక్షణాల కారణంగా అందంకు సంబంధించిన చిట్కాలలో దీనికి ప్రత్యేక స్థానం ఉంది. ఈ ప్రత్యేకమైన పసుపుతో బంగాళాదుంపలను ఉపయోగించడం వల్ల సూర్యరశ్మి వలన చర్మానికి నష్టం తగ్గుతుంది, చర్మ రంధ్రాలు తెరవబడతాయి, బ్యాక్టీరియా మరియు సూక్ష్మక్రిములు తొలగింపబడుతాయి. మొటిమలు మరియు మచ్చలు మాయమై చర్మం ప్రకాశవంతంగా మారుతుంది. కావలసినవి . సగం బంగాళాదుంప సన్నగా తురిమినది . సగం చెంచా కాస్మోటిక్ పసుపు విధానం . బంగాళాదుంప తురుములో ఒక చిటికెడు కాస్మోటిక్ పసుపు జోడించాలి . ఈ మిశ్రమాన్ని



ముఖం మరియు మెడపై రాయండి. . ఈ మిశ్రమాన్ని మీ ముఖం మీద 15 నిమిషాలు ఉంచండి. . తర్వాత మీ ముఖాన్ని చల్లటి నీటితో కడగాలి. . ఉత్తమ పరిష్కారాల కోసం ఈ మిశ్రమాన్ని వారానికి రెండు లేదా మూడు సార్లు వాడండి. మొటిమలు, నల్ల మచ్చలు మరియు మొటిమలతో వచ్చే మచ్చలను తగ్గించడానికి మొటిమలు, నల్ల మచ్చలు మరియు మొటిమలతో వచ్చే మచ్చలను తగ్గించడానికి దోసకాయ సన్ టాన్ నివారించడంలో, చర్మాన్ని శుభ్రపరచడానికి మరియు చర్మం సున్నితంగా చేయడానికి ఒక అదుతేమైన నివారణ. దోసకాయతో పాటు బంగాళాదుంప మరియు నిమ్మరసం చర్మంలోని రంధ్రాలను తెరిచి, అదనపు నూనెను తీసివేసి చర్మాన్ని లోతుగా శుభ్రం చేయడానికి సహాయపడతాయి. చర్మంలో కణితులు, మచ్చలు మరియు మొటిమలను తగ్గిస్తుంది. పసుపులోని యాంటీ బాక్టీరియల్ లక్షణాల వల్ల పసుపు చర్మం మెరుస్తూ ఉండటానికి సహాయపడుతుంది. కావలసినవి . 2 స్పూన్ బంగాళాదుంప రసం . 1 స్పూన్ నిమ్మరసం . 2 స్పూన్ దోసకాయ రసం . ఒక చిటికెడు పసుపు విధానం . పైన సూచించిన అన్ని పదార్థాలను పసుపుతో కలిపి పేస్ట్‌గా చేసుకోండి. . ఈ పేస్ట్ ను మీ ముఖానికి రాయండి. . ఈ పేస్ట్ మీ ముఖం మీద పూర్తిగా ఆరిపోయే వరకు వేచి ఉండండి. . మీ ముఖంపై ఫేస్ ప్యాక్ పూర్తిగా ఆరిపోయిన తర్వాత చల్లటి నీటితో కడగాలి. . మంచి పరిష్కారం పొందడానికి వారానికి రెండుసార్లు దీన్ని అనుసరించండి. . నీటితో కలిపిన నిమ్మరసం వాడటం మర్చిపోవద్దు. నిమ్మరసాన్ని నేరుగా ముఖానికి పూయడం వల్ల చర్మానికి చికాకు కలుగుతుంది. చర్మ పునరుజ్జీవనం మరియు మొటిమల నివారణ కోసం చర్మ పునరుజ్జీవనం మరియు మొటిమల నివారణ కోసం బంగాళాదుంపలలోని యాంటీఆక్సిడెంట్ మరియు బీటా కెరోటిన్ కారణంగా చర్మ ఆరోగ్యం మెరుగుపడుతుంది. బంగాళాదుంప పేస్ట్ లో బాదం నూనె మరియు తేనె జోడించడం వల్ల చర్మంలో చైతన్యం నింపుతుంది. చర్మం దద్దుర్లు నుండి ఉపశమనానికి సహాయపడుతుంది, ధూళిని తొలగిస్తుంది మరియు చర్మంపై కనిపించే సన్నని గీతలు కనబడనివ్వకుండా చేయడానికి సహాయపడుతుంది. దీనివల్ల మచ్చలు లేని చర్మం మొటిమలు, స్కార్స్ మరియు స్కిన్ పాచెస్ లేకుండా చేస్తుంది. కావలసినవి . ఒక చిన్న బంగాళాదుంప . ఒక చెంచా బాదం నూనె . ఒక చెంచా తేనె విధానం . తురిమిన బంగాళాదుంపలో కొద్దిగా బాదం నూనె మరియు తేనె కలపండి. . ఈ మిశ్రమాన్ని మీ ముఖానికి రాయండి. . అరగంట తర్వాత చల్లటి నీటితో మీ ముఖాన్ని కడగాలి. . మచ్చలేని చర్మం పొందడానికి, మీరు వారానికి రెండుసార్లు ఈ రెసిపీని అనుసరించవచ్చు.

# మానసిక దృఢత్వం



ఈప్రపంచంలో మనం మనిషి గెలుప్ష మనోబలంతోనే ఆరంభమవ్షతుంది. అన్ని మానసిక స్థితిపైన ఆధారపడి ఉంటుంది. వృద్ధాప్యంలో అరవై ఏళ్లు దాటినవారు ఇంకాను మనం నూరేళ్లు బతకగలం అనే మనస్థైర్యం ఉంటే నూరేళ్లు బతకగలం. జీవితంలో గొప్పగా ఆలోచించాలి. జీవితప్ష పోరాటం ఎల్లప్షుడూ ధైర్యం, స్థైర్యం గలవారే ముందుం టారు. ఉదయం రోజుకు అద్దం పట్టినట్లే వృద్ధాప్యం మనిషికి అద్దంపడుతుంది. మనుషుల జీవితంలోని వ్యవహారం, వరదలో ఉవ్వెత్తున లేచే అలలా అదృష్టం వైప్షకు తీసుకువెళుతుంది. తమ జీవిత ప్రయాణంలో దాన్ని వదిలేస్తే మాత్రం అది మిమ్మల్ని కష్టాలలో ముంచుతుంది. కలుగుతుంది. విటమిన్లు, ఖనిజ లవణాలు అవసరం. వృద్ధాప్యంలో ఎంతైనా అవసరం. విటమిన్లు లోపంతో పాటు కాల్షియం, ఐరన్ లోపం ఎక్కువైతే వృద్ధుల్లో రక్తహీనత ఏర్పడుతుంది. వయస్సు మళ్లిన వారిలో ఎముకల బలం తగ్గి తేలికగా విరిగిపోతుంది. ఆహారంలో కాల్షియం అవసరమవ్ష తుంది. 40 సంవత్సరాలపై బతికినవారు కాల్షియం ఎక్కువగా ఉండేవి తీసుకోవాలి. వృద్ధులకి కూడా వయసులో ఉన్న వారు తీసుకునే ఆహారమివ్వాలి. ప్రోటీన్లు ఎక్కువగా ఉండే ఆహారం కాయకూరలు, ఆకుకూరలు, పళ్లు, పాలు ఎక్కువగా తీసుకోవాలి. అయితే శరీర బరువ్ష పెరగకుండా చూసుకోవాలి. మంచి ఆహారంతో పాటు మంచినీళ్లు ఎక్కువ తాగాలి. తగినంత తగినంత శ్రమ కూడా అవసరం. రోజూ కొంత దూరం నడవాలి. పెరటితోటలో పని చేయడం ఆరోగ్యానికి అవసరం. క్యాబేజి, కాలిఫ్లవర్‌తో పాటు పచ్చ పచ్చని ఆకు కూరలు ఎక్కువగా తినాలి. వీటిలో విటమిన్లు, ఖనిజ లవణాలు ఎక్కువగా లభ్యమవ్షతుంది. రక్తం కూడా బలపడుతుంది. నీరసం వంటివి చేరవ్ష. వయస్సు మీద పడినా బలంగా కనపడతారు. ఆహారంలో కోడి గుడ్లు, చేపలు, మాంసం తినాలి. వారానికి కనీసం 4-5 కోడి గుడ్లు యివ్వాలి. శాఖాహారం తీసుకునే వారికి చిక్కుడు, బఠాణీలు, వేరు శనగ, పాలు, పప్షులు పెట్టాలి. రోజూపండ్ల రసం తీసుకుంటే మంచిది. వృద్ధాప్యంలో ఆహారం ఒకేసారి ఎక్కువ తీసుకోరాదు. రోజుకు 4-5 సార్లు తినాలి. తక్కువ మోతాదులో తీసుకోవాలి. పళ్లు సరిగ్గాలేకపోతే దంతవైద్యునికి చూపించి కట్టుడు పళ్లు పెట్టుంచుచోండి. ఆహారం బాగా నమిలి తినడానికి ఇవి ఉపయోగపడతాయి. కట్టుడు పళ్లు సరిగ్గా ఉండకపోతే తినే కాస్తా కూడా తినలేకపోగలరు. కట్టుడు పళ్ల విషయంలో నూతన విధానాలు వచ్చి యున్నవి. బత్తాయి, కమల, నారింజ, టొమాటో, సపోటాలు తినాలి. వెజిటబుల్ పలావ్ష సమీకృత ఆహారం తింటే మంచిది. గట్టిగా ఉంటే ఆహారం నమలలేప్షుడు పొడి చేసి తినాలి. మెత్తగా వండిగాని పెట్టాలి. కాచి చాలార్చిన నీటిని తాగాలి. నిద్రపోవాలి. వీలైతే మధ్యాహ్నం కునుకుపోవటం మంచిది. నిద్ర కొత్త శక్తినిస్తుంది. చక్కెర, ఉప్ష తక్కువగా వాడాలి. జీవితం పట్ల ఆశావాంతో కూడిన దృక్పథం కలిగి వ్షండండి. మీ కష్టాలు, బాధల్ని పట్టించుకోకుండా యితరుల్ని సంతోషపరచే ప్రయత్నం చేయండి. ఎంత వీలైతే అంత నవ్వండి.

# కొబ్బరి పాలు ఆముదం నూనెతో చుండ్రుకు గుడ్ బై

జుట్టుకు సంబంధించి మనకు వచ్చే సమస్యల్లో చుండ్రు కూడా ఒకటి. చికాకు తెప్పించే సమస్య చుండ్రు. చుండ్రు/డాండ్రఫ్ ఏర్పడటానికి అసలైన కారణం తెలియనప్పటికీ చర్మంలో కొన్ని పరిస్థితుల వలన ఈ సమస్య ఏర్పడుతుంది. రోజూ షాంపూ పెట్టి స్నానం చేసినా కొన్నిసార్లు చుండ్రు వదలదు. చుండ్రు వల్ల జుట్టు ఆరోగ్యంగా, ప్రకాశవంతంగా కనబడదు. వాటి కోసం వివిధ రకాల షాంపులు మార్చినా ఎలాంటి ప్రయోజనం ఉండదు. అటువంటప్పుడు ఇతర పరిష్కారాల కోసం వెతకడం మంచిది. చుండ్రు జుట్టు ఆరోగ్యాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో మనం తెలుసుకోవాలి. చుండ్రు జుట్టు సమస్యల్లో ఈ అసౌకర్యాన్ని ఎలా తొలగించాలి మరియు మీ జుట్టును ప్రకాశవంతంగా మార్చుకోవాలి. జుట్టు ఆరోగ్యంగా మంచి షైనింగ్ తో నిగనిగలాడుతూ కనబడటం చాలా ముఖ్యం. చుండ్రు రావడానికి ఫంగల్ ఇన్‌ఫెక్షన్ ప్రధాన కారణమైనా, ఇతర కారణాలు కూడా ఉంటాయి. పొల్యూషన్, హార్మోన్ల అసమతుల్యత, ఒత్తిడి, నరాల జబ్బులు, శుభ్రత పాటించకపోవడం వంటివి కారణమవుతాయి. అయితే మెడికేటెడ్ షాంపూల అవసరం లేకుండానే ఇంట్లోనే కొన్ని చిట్కాలు పాటించడం ద్వారా చుండ్రు దూరం చేసుకోవచ్చు. జుట్టు సంరక్షణ కోసం కొబ్బరి పాలు మరియు ఆముదం నూనెను ఉపయోగించి చుండ్రును శాశ్వతంగా నివారించుకోవచ్చు. ఈ రెండింటి కలయి చుండ్రును తొలగిస్తుంది మరియు జుట్టు ఆరోగ్యానికి దోహదం చేస్తుంది. ఈ హోం రెమెడీ గురించి మరిన్ని విషయాలు తెలుసుకోవడానికి ముందు చుండ్రుకు గల అసలు కారణాలేంటో చూద్దాం. పొడి బారిన చర్మం ఉన్నవారికి డాండ్రఫ్ సమస్య ఏర్పడవచ్చు. కొన్ని రకాలైన షాంపూలు మరియు స్కిన్ కేర్ ప్రొడక్ట్స్ డాండ్రఫ్ ని ప్రేరేపించవచ్చు. స్కాల్ప్ పై ఫంగల్ ఇనొక్షన్ లేదా రింగ్ వార్మ్ సమస్య వలన చుండ్రు ఏర్పడవచ్చు. ఎలర్జీ వలన కలగచ్చు. సోరియాసిస్ సమస్య ఉన్నవారికి డాండ్రఫ్ ఏర్పడే అవకాశాలు ఎక్కువ. ఈ సమస్య ఉన్న వాళ్ళు తరచూ తల స్నానం చేయకపోవటం వలన పరిస్థితి తీవ్రం అవుతుంది. స్ట్రెస్ మరియు చల్లని వాతావరణం వలన డాండ్రఫ్ అధికరించవచ్చు. సరైన పోషక ఆహారాలను తీసుకోక పోవటం వలన కూడా చుండ్రు సమస్య ఏర్పడవచ్చు. కారణాలు తెలుసుకున్నారాగా మరి ఇంటి చిట్కాలు తెలుసుకుందాం. కొబ్బరి పాలు మిశ్రమాన్ని ఎలా తయారు చేయాలో చూద్దాం. ఒక టీస్పూన్




కొబ్బరి పాలలో కొద్దిగా ఆముదం నూనెను కలిపి తలకు బాగా పట్టించాలి. ఒక గంట తర్వాత నార్మల్ వాటర్ తో తలస్నానం చేయాలి. ఇలా వారానికి మూడు రోజులు చేస్తే, జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది. చుండ్రు నివారణకు మంచి ఎంపిక. చుండ్రును పోగొట్టడంతో పాటు, ఇందులో ఇతర ప్రయోజనాలు కూడా ఉన్నాయి. ఆ ప్రయోజనాలేంటో చూద్దాంజచుండ్రుతో బాధపడేవారికి వివిధ నివారణ చర్యలు అందుబాటులో ఉన్నాయి. కానీ కొబ్బరి పాలు, ఆముదం నూనె మిశ్రమం ఈ సమస్యను తగ్గించడానికి సహాయపడుతుంది. రెండింటినీ కలిపి తలకు అప్లై చేయడం ద్వారా చుండ్రును శాస్వతంగా తొలగిస్తుంది. కాబట్టి ఈ పరిస్థితులను నయం చేయడానికి మనం కొబ్బరి పాలను ఉపయోగించవచ్చు. ఈ హోం రెమెడీని వారంలో రెండు లేదా మూడు సార్లు ఉపయోగించడం ద్వారా ఈ సమస్యను పూర్తిగా తొలగించుకోవచ్చు. కొబ్బరి పాలు మిశ్రమాన్ని చుండ్రు తొలగించడానికి ఉపయోగిస్తారు. వాస్తవంగా చెప్పాలంటే పొడవాటి జుట్టుకు ఆముదం ఆయిల్ ఉత్తమం. కాబట్టి చుండ్రులేని పొడవాటి జుట్టును కోరుకునే వారు కొబ్బరి పాలతో పాటు కొద్దిగా ఆముదం ఆయిల్ ను కలిపి తలకు ప్యాక్ వేసుకోవాలి. క్రమం తప్పకుండా ఈ రెండూ తలకు అప్లై చేస్తుంటే పొడవాటి జుట్టు పొందాలనే మీకోరిక తీరుతుంది. మీ జుట్టు ఆరోగ్యంగా, బలంగా మరియు శాస్వతంగా పెరగడానికి కొబ్బరి పాలు ముఖ్యమైన నూనె బాదం లేదా కొబ్బరి నూనె మిశ్రమం ఉత్తమమైన వాటిల్లో ఒకటి. జుట్టును కాంతివంతంగా మెరిసిసేట్లు చేసే వాటిలో కొబ్బరి పాలు, ఆముదం నూనె మిశ్రమం ఒకటి మీ జుట్టు యొక్క మెరిసే మరియు ముదురు రంగును పెంచడానికి కొబ్బరి పాలు మిశ్రమం ఉత్తమమైన పదార్థాలలో ఒకటి. ఇది జుట్టు ఆరోగ్యానికి మంచిది. కాబట్టి, గ్లో పెంచడంతో పాటు, మీ జుట్టును బలోపేతం చేయడానికి ఈ రెండింటి కలయిక ఉత్తమమైనది. ఈ రెండు మిశ్రమాలు జుట్టుకు కావల్సిన మెరుపును పెంచుతాయి. కాబట్టి ఈ మిశ్రమాన్ని ఎటువంటి సందేహం లేకుండా ఉపయోగించవచ్చు. తమ జుట్టు ఒత్తుగా, అందంగా ఉండాలని చాలా మంది కోరుకుంటారు. కానీ నిజం ఏమిటంటే చాలామందికి అది లభించదు. అందువల్ల, కొబ్బరి పాలు ఆముదం నూనె మిశ్రమం వల్ల ఒత్తైన జుట్టును పొందవచ్చు. ఒత్తైన జుట్టుతో పాటు, జుట్టు ప్రకాశంతంగా మరియు నల్లగా స్ట్రాంగ్ గా పెరగడానికి సహాయపడుతుంది. ఈ రెండింటి కాంబినేషన్ జుట్టు ఆరోగ్యానికి గొప్ప ప్రయోజనాలను ఇస్తుంది. అవోకాడో ఆయిల్ మీ జుట్టుకు చికిత్స చేయడానికి ఉత్తమమైన మార్గాలలో ఒకటి.

# గర్భంలో కవలలున్నప్పుడు ఎదురయ్యే సాధారణ సమస్యలు, జాగ్రత్తలు


గర్భం పొందడం ప్రతి మహిళకు ఒక వరం. అలాగే ప్రతీ స్త్రీ కోరిక. గర్భం పొందడం మరియు బిడ్డకు జన్మనివ్వడం, అమ్మ అనిపించుకోవడం ఉన్న మాధుర్యం, ఆనందం మాటల్లో చెప్పలేనంత. కానీ గర్భధారణ సమయంలో మహిళలు అనేక రకాల సమస్యలను ఎదుర్కొంటారు. కానీ చివరికి అప్పటి వరకు గర్భిణీ అనుభవించిన సమస్యలన్నీ బిడ్డ పుట్టగానే మర్చిపోతారు. అయితే గర్భిణీ నెల తప్పిందని తెలియగానే చాలా సంతోషంగా ఉంటుంది. తగిన జాగ్రత్తలన్నీ తీసుకుంటుంది. సుఖ ప్రసవం కోసం ఎదురు చూస్తుంటుంది. కానీ అదే గర్భంలో ఇద్దరు శిశువులున్నట్లు తేలిస్తే? అప్పటి నుండి మొదలవుతుంది తల్లిలో ఆందోళన, సందేహాలు. పొట్టలో కవలలున్నప్పుడు తల్లికి అనేక సందేహాల కలగవచ్చు. అవి ఆమెకు నిద్ర పట్టకుండా చేయొచ్చు. పుట్ట బోయే ఇద్దరు బిడ్డలు ఆరోగ్యంగా పుడతార? కవలల కోసం ఎలాంటి ఆహారం తీసుకోవాలి? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి లేదా ఏదైనా ఇతర సమస్యలు కలుగుతాయన్న ఆందోళను చాలా మంది గర్భిణీల మనస్సులో మెదిలే ప్రశ్నలు? వీటన్నింటికి సమాధానం ఇక్కడ ఉంది. ట్విన్స్ తో గర్భవతిగా ఉంటే ఆమె శరీరంలో ఎలాంటి మార్పులు జరుగుతాయి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఇప్పుడు చూద్దాం. ప్రసవ సమయంలో సమస్యలు ప్రసవ సమయంలో సమస్యలు మీరు కవలలతో గర్భవతిగా ఉంటే ప్రసవ సమయంలో మీకు ఎక్కువ సమస్యలు వస్తాయి. ఇటువంటి వారిలో చాలామంది డెలివరీ డేట్ కు ముందే ప్రసవించే అవకాశం ఉంది. అంతేకాక, 37 వారాలకు ముందే ప్రసవించే ప్రమాదం ఉంది. కొన్ని



సందరాల్లో, అండర్-గ్రోత్ ప్రమాదాన్ని తోసిపుచ్చలేము. శిశువు బరువు శిశువు బరువు మరొక అంశం శిశువు యొక్క బరువు. మీరు కవలలతో గర్భవతిగా ఉంటే మీ బిడ్డ బరువు తగ్గే ప్రమాదం తక్కువ. శిశువు యొక్క బరువు 2.5 కిలోల కంటే తక్కువ. ప్రమాదం చాలా ఎక్కువగా ఉంటుంది. చాలా జాగ్రత్త అవసరం. ఈ విషయాలు కొంచెం జాగ్రత్తగా చూసుకోవాలి. మీ వైద్యుడిని క్రమం తప్పకుండా కలిసి తగిన జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యం. పెరుగుదల లేకపోవడం పెరుగుదల లేకపోవడం గర్భాశయ పెరుగుదల పరిమితి తరచుగా కవలలలో సంభవిస్తుంది. ఇది శిశువు యొక్క పెరుగుదలను మందగించే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. గర్భాశయంలోని మావి క్రమంగా ఇద్దరు శిశువుల పెరుగుదలకు తగినంత ప్రోటీన్ ఇవ్వలేకపోతుందిమావి సమస్యలు కవలలున్న గర్భిణీలో తరచుగా మావి సమస్యల ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ఎందుకంటే కొంతమంది కవలలకు ఒక మావి సరిపోదు, ప్రీక్లాంప్సియా మరియు ప్రెగ్నెన్సీ ప్రేరిత రక్తపోటు (పిఐహెచ్) అభివృద్ధి చెందే ప్రమాదం ఉంది.





# 'యానిమల్' బ్యూటీకి దెబ్బ మీద దెబ్బ..!



రణబీర్ కపూర్ హీరోగా రష్మిక మందన్న హీరోయిన్‌గా సందీప్ రెడ్డి వంగ దర్శకత్వంలో వచ్చిన మూవీ 'యానిమల్'. 2023లో విడుదలైన యానిమల్ బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ విజయాన్ని సొంతం చేసుకుంది. సినిమాలో హీరోయిన్‌గా నటించిన రష్మిక మందన్న పాత్రతో పోల్చితే త్రిప్తి డిమ్రి పోషించిన జోయ పాత్ర అందరి దృష్టిని ఆకర్షించింది. ఆ పాత్ర ఉన్నది కొంత సమయం అయినా కూడా సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. రణబీర్ కపూర్, త్రిప్తి కాంబోలో ఉన్న రొమాంటిక్ సీన్స్ సినిమా స్థాయిని మరో లెవల్‌కి తీసుకు వెళ్లాయి అంటూ చాలా మంది రివ్యూలు ఇచ్చారు. దాంతో త్రిప్తి డిమ్రి క్రేజ్ ఒక్కసారిగా పెరిగింది. ప్రస్తుతం ఈ అమ్మడు వరుస సినిమాల్లో నటిస్తోంది ఈ సమయంలో త్రిప్తి డిమ్రిని ఒక బాలీవుడ్ స్టార్ హీరోయిన్‌కి చెందిన పీఆర్ టీం డీ గ్రేడ్ చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఆమెను కెరీర్ పరంగా వెనక్కి లాగేందుకు ప్రయత్నిస్తున్నారు అని ఆరోపణలు వినిపిస్తున్నాయి. త్రిప్తితో సినిమాలు చేయవద్దని చాలా మంది దర్శక నిర్మాతలతో సదరు పీఆర్ టీం చెప్పిందని కూడా కొందరు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆ పీఆర్ టీం చేసిన పబ్లిసిటీ కారణంగా త్రిప్తి డిమ్రి ఇప్పటికే పలు ఆఫర్లను చేజార్చుకుందట. తాజాగా త్రిప్తికి మరో షాక్ తగిలింది. ఇటీవలే ఈమె ప్రముఖ హీరో షాహిద్ కపూర్ సినిమాలో హీరోయిన్‌గా ఎంపిక అయింది. విశాల్ భరద్వాజ్ దర్శకత్వంలో ఆ సినిమాను రూపొందిస్తున్నారు. షాహిద్ కపూర్ హీరోగా విశాల్ భరద్వాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా షూటింగ్ ప్రారంభం సమయంలో త్రిప్తి డిమ్రి పాత్ర గురించి ప్రముఖంగా చర్చ జరిగింది. సింగిల్ కార్డ్ హీరోయిన్ అన్నారు. కానీ ఇప్పుడు పరిస్థితులు మారాయట. త్రిప్తి పాత్ర పరిధిని తగ్గించారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. బాలీవుడ్ వర్గాల్లో వినిపిస్తున్న పుకార్ల అనుసారం ఈ సినిమాలో మరో అందాల ముద్దుగుమ్మను కీలక పాత్ర కోసం ఎంపిక చేశారట. మొదట దిశా పటానీని ఈ సినిమాలోని రెండు పాటల కోసం ఎంపిక చేశారనే వార్తలు వచ్చాయి. షాహిద్ కపూర్‌తో కలిసి దిశా పటానీ రెండు పాటల్లో కనిపించబోతుందని అంటున్నారు. కానీ అంతకు మించి ఆమె ఉంటుందనే పుకార్లు వినిపిస్తున్నాయి. యానిమల్ తర్వాత త్రిప్తి డిమ్రికి సాలిడ్ హిట్ పడలేదు. చేసిన సినిమాలన్నీ పెద్దగా ప్రాముఖ్యత లేని సినిమాలే కావడంతో ఈ సినిమాపై త్రిప్తి చాలా ఆశలు పెట్టుకుంది. ఇలాంటి సమయంలో దిశా పటానీని ఈ సినిమాలో దించడం తో ఆమె ప్రాముఖ్యత తగ్గుతుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఇది ఖచ్చితంగా త్రిప్తి కెరీర్‌కు పెద్ద దెబ్బ అనే అభిప్రాయంను బాలీవుడ్ వర్గాల వారు వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలే ప్రభాస్‌తో సందీప్ రెడ్డి వంగ రూపొందించబోతున్న స్పిరిట్ సినిమాలో త్రిప్తి డిమ్రిని హీరోయిన్‌గా ఎంపిక చేశారు. షాహిద్ కపూర్ సినిమా హిట్ అయ్యి, స్పిరిట్ కూడా సక్సెస్ అయితే త్రిప్తి బాలీవుడ్‌లో టాప్ హీరోయిన్‌గా ఖ్యాతి దక్కించుకునేది. కానీ ఇప్పుడు షాహిద్ కపూర్ సినిమా క్రెడిట్ ఆమెకు ఎంత దక్కుతుందో చెప్పలేం అంటూ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



# తమ్ముడు సినిమా.. దిల్ రాజు ఇంట్రెస్టింగ్ లీక్స్!




యంగ్ హీరో నితిన్ నటించిన లేటెస్ట్ సినిమా తమ్ముడు విడుదలకు మరో కొన్ని గంటలే మిగిలివుండగా, మేకర్స్ ప్రమోషన్ల జోరుతో సినిమాపై బజ్ పెంచుతున్నారు. జూలై 4న థియేటర్లలో గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధమవుతున్న ఈ సినిమాకు వకీల్ సాబ్, ఎంసీఏ ఫేమ్ వేణు శ్రీరామ్ దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు నిర్మిస్తున్నారు. ఇప్పటికే రిలీజైన టీజర్, ట్రైలర్ సినిమాపై మంచి అంచనాలు నెలకొల్పాయి. నితిన్ - లయ మధ్య బ్రదర్ సెంటిమెంట్ ఆధారంగా కథ సాగుతుందని తెలుస్తోంది. హీరోయిన్‌గా సప్తమి గౌడ, మరో కీలక పాత్రలో వర్ష బొల్లమ్మ నటిస్తున్నారు. అజనీష్ లోక్‌నాథ్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ట్రైలర్‌లోనే ఆకట్టుకుంది. ఇప్పుడీ సినిమా గురించి దిల్ రాజు ఓ ఆసక్తికరమైన అప్‌డేట్ ఇచ్చారు. ఇటీవల ఇంటర్వ్యూలో దిల్ రాజు మాట్లాడుతూ, "తమ్ముడు సినిమాను థియేటర్ అనుభూతికి తగ్గట్టు డిజైన్ చేశాం. మొదటి 20 నిమిషాల తర్వాత, మిగతా కథ మొత్తం ఒకే రోజు జరుగుతుంది. ఇది సినిమా స్పెషల్ హైలైట్. మేజర్ కథనాన్ని ఓ సింగిల్ డేలో ఎమోషనల్, ఇంటెన్స్ టర్నింగ్ పాయింట్స్‌తో నడిపించే విధంగా డైరెక్టర్ వేణు శ్రీరామ్ నిర్మాణం చేశాడు," అని వివరించారు. ఈ కథా శైలి ప్రేక్షకులకు థ్రిల్ కలిగిస్తుందని ఆయన అన్నారు. అంతేగాకుండా, ఈ సినిమాలో మొత్తం6 స్ట్రాంగ్ యాక్షన్ ఎలిమెంట్స్ ఉన్నాయని, అవన్నీ థియేటర్లోనే చూస్తే పూర్తి అనుభూతి దక్కుతుందని దిల్ రాజు చెప్పారు. సినిమాకు సౌండ్, విజువల్ అనుభవం ప్రత్యేకంగా ఉండేలా డైరెక్టర్ శ్రద్ధ తీసుకున్నారని వెల్లడించారు. ముఖ్యంగా క్లైమాక్స్ లో వచ్చే సీక్వెన్స్ ప్రేక్షకులను భావోద్వేగంతో కదిలించేలా ఉంటుందని హింట్ ఇచ్చారు. తమ్ముడు సినిమాలో లయ రీ ఎంట్రీ చాలా ప్రత్యేకమైన అంశం. ఆమె నితిన్ అక్కగా కీలక పాత్రలో కనిపించనుండటం, సినిమా ఎమోషనల్ కోర్‌ను బలోపేతం చేస్తుందని చెబుతున్నారు. అలాగే వర్ష బొల్లమ్మ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. వీరి పాత్రలు కథకు ప్రధాన మలుపులు ఇస్తాయని సమాచారం. కాంతారా ఫేమ్ అజనీష్ లోక్‌నాథ్ సంగీతం కూడా సినిమాకు పెద్ద బలంగా నిలవనుందని మేకర్స్ నమ్మకం. ఇప్పటికే సినిమా సెన్సార్ పూర్తయి, ం సర్టిఫికెట్ తో విడుదలకు సిద్ధంగా ఉంది. వింటేజ్ విలేజ్ బ్యాక్‌డ్రాప్‌తో సినిమా రూపొందుతుండగా, ఏమోషన్స్ తో పాటు యాక్షన్ మిక్స్‌తో థియేటర్ ప్రేక్షకులను మెప్పించేలా ఉన్నట్టు ప్రివ్యూ వర్గాల సమాచారం. ఇక సినిమా ఆడియెన్స్ ముందుకు వచ్చాక ఎలాంటి రిజల్ట్ అందుకుంటుందో చూడాలి.

# శ్రీలీల మరోసారి సై అంటుందా?



కన్నడ ఇండస్ట్రీలో కెరీర్ ను స్టార్ట్ చేసిన శ్రీలీల, దర్శకేంద్రుడు రాఘవేంద్ర రావు దర్శకత్వంలో వచ్చిన పెళ్లి సందడి సినిమాతో టాలీవుడ్ కు పరిచయమయ్యారు. మొదటి సినిమాతోనే యాక్టింగ్, తన డ్యాన్సులతో ఆడియన్స్ ను ఎట్రాక్ట్ చేసిన శ్రీలీల ఆ తర్వాత రవితేజకు జోడీగా ధమాకా సినిమాలో నటించి బ్లాక్ బస్టర్ ను తన ఖాతాలో వేసుకున్నారు. ధమాకా తర్వాత శ్రీలీల వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు. చిన్నా, పెద్దా తేడా లేకుండా ఎన్నో సినిమాల్లో నటించి తక్కువ టైమ్ లోనే స్టార్ హీరోయిన్ గా క్రేజ్ సంపాదించుకున్నారు. ప్రస్తుతం శ్రీలీల కేవలం టాలీవుడ్ లోనే కాకుండా బాలీవుడ్ లో కూడా సినిమాలు చేస్తున్నారు. స్టార్ హీరో కార్తీక్ ఆర్యన్ తో కలిసి బాలీవుడ్ ఎంట్రీకి రెడీ అయిన శ్రీలీల క్రేజ్ ఇప్పుడు ఓ రేంజ్ లో ఉంది. ఇవన్నీ ఒకెత్తయితే ఓ వైపు హీరోయిన్ గా బిజీగా ఉంటూనే పుష్ప2 సినిమాలో అల్లు అర్జున్ సరసన కిస్సిక్ సాంగ్ చేసి నేషనల్ వైడ్ పాపులైరయ్యారు శ్రీలీల. ఇంకా చెప్పాలంటే కిస్సిక్ సాంగ్ చేశాక శ్రీలీల క్రేజ్, మార్కెట్ మరింత పెరిగాయని చెప్పొచ్చు. ఆల్రెడీ పుష్ప2 లో చేసిన స్పెషల్ సాంగ్ తనకు మంచి గుర్తింపును ఇవ్వడంతో ఇప్పుడు శ్రీలీల మరో స్పెషల్ సాంగ్ చేయడానికి రెడీ అవుతున్నట్టు తెలుస్తోంది. యువ సామ్రాట్ అక్కినేని నాగ చైతన్య, విరూపాక్ష ఫేమ్ కార్తీక్ దండు కలయికలో ఓ మిస్టిక్ థ్రిల్లర్ రూపొందుతున్న సంగతి తెలిసిందే. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో ఓ స్పెషల్ సాంగ్ ఉందని, ఆ సాంగ్ ను టాలీవుడ్ హ్యాపెనింగ్ హీరోయిన్ శ్రీలీలతో చేయించాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తోంది. ఒకవేళ నిజంగా శ్రీలీల ఈ సాంగ్ చేస్తే సినిమాకు ఈ సాంగ్ చాలా ప్లస్సయ్యే ఛాన్సుంది. మరి ఈ వార్తల్లో నిజమెంతన్నది తెలియాల్సి ఉంది.




Printed and Published and Owned by **Dr. K. HARINATHA REDDY** on behalf of **Abhyudaya Publications, cell : 098483 34101, Printed at Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh and Published From **Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh, **Editor : Gudur Gopal, RNI No. APTEL/2012/46940,** e-mail: **sreechakratelugu@gmail.com.**